# విలేకరులు కావలెను

చట్టం మీ చుట్టం

ప్రతి క్షణం ప్రజల పక్షం నిలబడే
చట్టం మీ చుట్టం దినపత్రికకు ఆంధ్రప్రదేశ్
మరియు తెలంగాణ రాష్ట్రాలలోని అన్ని జిల్లాల
వ్యాప్తంగా విలేకరులు కావలెను.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్

9581419999



# చట్టం మీ చుట్టం

జాతీయ తెలుగు దిన పత్రిక


## జెఇఇ మెయిన్ ఫలితాల విడుదల

### వందశాతంతో సత్తా చాటిన ముగ్గరు తెలుగు విద్యార్థులు

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి16 :** దేశ వ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు ఉత్కంఠతో ఎదురుచూస్తోన్న జేఈఈ (మెయిన్) పేపర్-1 ఫలితాలు వచ్చేశాయి. సోమవారం ఉదయం ఫైనల్ కీ విడుదల చేసిన ఎన్‌టీఏ అధికారులు.. తాజాగా ఫలితాలను విడుదల చేశారు. ఈ ఫలితాల్లో తెలుగు విద్యార్థులు సత్తా చాటారు. ఏపీ నుంచి ఇద్దరు, తెలంగాణ నుంచి ఒక విద్యార్థి 100 పర్సంటైల్ స్కోరుతో అదరగొట్టారు. అభ్యర్థులు తమ అప్లికేషన్ నంబర్, పాస్‌వర్డ్‌తో పాటు క్యాప్చా కోడ్ ఎంటర్ చేసి స్కోర్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.దేశంలో ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీల్లో బీఈ/బీటెక్ కోర్సుల్లో ప్రవేశాలకు జనవరి 21, 22, 23, 24, 28 తేదీల్లో జేఈఈ మెయిన్ పేపర్ -1 పరీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. జనవరి 29న నిర్వహించిన జేఈఈ మెయిన్ పేపర్-2 ఫలితాలను తర్వాత ప్రకటించనున్నారు. జేఈఈ మెయిన్ పరీక్షలకు దేశ వ్యాప్తంగా 13,55,293మంది రిజిస్టర్ చేసుకోగా.. 13,04,653 మంది (96.26?) హాజరయ్యారు. ఈ ఫలితాల్లో

మిగతా 2వ పేజీలో..

సంపుటి : 14 ● సంచిక : 36 Simultaneously Published from Kurnool AP &TS, Bengaluru, Mumbai, Chennai, Kerala, Patna, Kolkata & Delhi మంగళవారం 17 ఫిబ్రవరి 2026 ● పేజీలు : 8 ● వెల 2/-

# పౌరసేవల తీరు ప్రశంశనీయం

- డేటా సంరక్షణ తదితర అంశాలపై ఆరా
- ఆర్టీజిఎస్‌ను బాబుతో కలసి సందర్శించిన గేట్
- టెక్నాలజీ ఆధారిత సేవలపై బాబు వివరణ
- ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు బాగున్నాయని ప్రశంసలు



**అమరావతి,ఫిబ్రవరి16(చట్టం న్యూస్) :** డేటా లేక్, వాట్సప్ గవర్నెన్స్ ద్వారా పౌర సేవల్ని సులభతరం చేయడం బాగుందని ఫౌండేషన్ వ్యవస్థాపక ఛైర్మన్ బిల్‌గేట్స్ అభినందించారు. ఆంధ్రప్రదేశ్ అనుసరిస్తున్న విధానాలను పరిశీలించిన గేట్స్ చంద్రబాబును ప్రశంసించారు. రాజధానిలో 30 శాతం గ్రీన్ అండ్ బ్లూ ప్రణాళిక బాగుందంటూ బిల్ గేట్స్ వ్యాఖ్యానించారు. రాజధాని నిర్మాణ తీరును ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించగా.. 'గ్రేట్ వర్క్' అంటూ బిల్ గేట్స్ కితాబిచ్చారు.ఆంధ్రప్రదేశ్ పర్యటనలో ఉన్న బిల్‌గేట్స్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి సచివాలయంలోని రియల్‌టైమ్ గవర్నెన్స్ కమాండ్ సెంటర్‌ను సోమవారం సందర్శించారు. ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి పాలనలో టెక్నాలజీ వినియోగాన్ని దగ్గరుండి పరిశీలించారు. రియల్ టైమ్ గవర్నెన్స్ ద్వారా పౌర సేవల్ని వేగంగా అందిస్తున్న తీరు, ఫలితాలను గేట్స్‌కు ఈ సందర్భంగా చంద్రబాబు వివరించారు. డేటాలేక్, అవేర్ 2.0, వాట్సప్ గవర్నెన్స్, సంజీవని ప్రాజెక్టు, రాజధాని అమరావతి ప్రాజెక్టుల గురించి బిల్‌గేట్స్ తెలుసుకున్నారు. ఆర్టీజీఎస్‌లోని డిస్‌ప్లే వాల్స్‌పై ప్రజంటేషన్లను పరిశీలించారు. డేటా లేక్ ద్వారా అన్ని ప్రభుత్వ శాఖలను అనుసంధానిం చామని సీఎం వివరించారు. డేటా లేక్, వాట్సప్ గవర్నెన్స్ ద్వారా పౌర సేవల్ని సులభతరం చేయడం బాగుందని ఈ సందర్భంగా బిల్‌గేట్స్ కితాబిచ్చారు. అవేర్ 2.0 ద్వారా రియల్ టైమ్‌లో సమాచారాన్ని సేకరించి, వేగంగా నిర్ణయాలు తీసుకుంటున్నట్లు గేట్స్‌కు సీఎం చంద్రబాబు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, పాలసీల అమలుపై ప్రజాభిప్రాయం సేకరిస్తున్న తీరునూ పరిశీలించారు. కీ పర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ ద్వారా జీఎస్డీపీ పెరుగుదలను ఎప్పటికప్పుడు అంచనా వేస్తున్నట్లు తెలిపారు. ప్రాపర్టీ రికార్డుల భద్రతకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారని బిల్‌గేట్స్ ప్రశ్నించగా.. బ్లాక్ చెయిన్ టెక్నాలజీతో ల్యాండ్ రికార్డులు భద్రపరుస్తున్నామని, భూ రికార్డులపై క్యూఆర్ కోడ్ వంటి విధానాలతో పారదర్శకంగా ఉండేలా చర్యలు తీసుకున్నామని అధికారులు వివరించారు. గేట్స్ ఫౌండేషన్ సహకారంతో చిత్తూరు జిల్లాలో కొనసాగుతున్న సంజీవని ప్రాజెక్టు అమలు

మిగతా 2వ పేజీలో..

## రష్యా నిర్ణయంపైనే బంగారం ధరలు

- డాలర్‌తో వాణిజ్యం కొనసాగితే తగ్గనున్న పసిడి
- అంతర్జాతీయ నిపుణుల వెల్లడి



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి16 (చట్టం న్యూస్):** అంతర్జాతీయ పరిస్థితులు బంగారాన్ని కంట్రోల్ చేస్తున్నాయి. రష్యా రూబుల్‌తో వ్యాపారం కారణంగా పరిస్థితి దిగజారిందని అంటున్నరు. తిరిగి రష్యా డాలర్‌తో వ్యఆరాన్ని పునరుద్ధరిస్తేనే బంగారం రేట్లు దిగి వస్తాయని అంటున్నారు. బంగారం అంటే ఇష్టపడేవారికి పండగలాంటి అంచనాను నిపుణులు వెలువరించారు. ఇప్పుడు 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.లక్షన్నర పైగా ఉండగా, ఇది రూ.లక్ష లోపునకు రావచ్చని.. అంతర్జాతీయ విపణిలో ఔన్సు బంగారం ధర 5,000 డాలర్ల వద్ద కదలాడుతుండగా, 3,000 డాలర్లకు దిగిరావచ్చని అంచనా వేస్తున్నారు. రష్యా కనుక అమెరికా

మిగతా 2వ పేజీలో..

# బిల్‌గేట్స్ పర్యటనతో ఏపికి పెరిగిన ప్రాధాన్యత

### గేట్స్‌కు స్వాగతం పలకడం ఆనందంగా ఉంది — ఎక్స్ వేదికగా డిప్యూటి సీఎం పవన్ కళ్యాణ్

**అమరావతి,ఫిబ్రవరి16 (చట్టం న్యూస్) :** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో గేట్స్ ఫౌండేషన్ చైర్మన్ బిల్‌గేట్స్ పర్యటన రాష్ట్రానికి ప్రాముఖ్యతను తెచ్చిపెట్టింది. ఈ మేరకు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఎక్స్‌లో ట్వీట్ పెట్టారు. అమరావతి పర్యటనలో భాగంగా బిల్‌గేట్స్‌కు.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో కలిసి ఆత్మీయ స్వాగతం పలకడం ఆనందంగా ఉందని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో కలిసి బిల్‌గేట్స్‌కు ఆత్మీయ స్వాగతం పలకడం గర్వకారణమని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, పేదరిక నిర్మూలన వంటి రంగాల్లో గేట్స్ ఫౌండేషన్ చేస్తున్న సేవలు విశేషమని పవన్ కల్యాణ్ కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో గేట్స్ ఫౌండేషన్ భాగస్వామ్యానికి చూపుతున్న నిబద్ధతను పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్ర అభివృద్ధిలో ఈ భాగస్వామ్యం కీలక పాత్ర పోషించబోతోందని పేర్కొన్నారు. విద్యారంగంలో గేట్స్ ఫౌండేషన్ భాగస్వామ్యం విద్యార్థులకు ఆధునిక విద్యను అందించడంలో సహాయపడుతుందని పవన్ కల్యాణ్ అభిప్రాయపడ్డారు. టెక్నాలజీ ఆధారిత విద్య, డిజిటల్ లెర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత బోధన వంటి విధానాలు విద్యార్థుల నైపుణ్యాలను పెంచడంలో కీలకంగా ఉంటాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరచడంలో కూడా ఈ భాగస్వామ్యం ఉపయోగపడు తుందని చెప్పుకొచ్చారు. ఆరోగ్య రంగంలో గేట్స్ ఫౌండేషన్ సహకారం ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించడంలో కీలక పాత్ర పోషించబోతోందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. గేట్స్ ఫౌండేషన్ అనుభవం రాష్ట్రానికి ఉపయోగపడుతుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవలను విస్తరించడం, టెక్నాలజీ ఆధారిత ఆరోగ్య సేవలను అందించడం వంటి అంశాల్లో భాగస్వామ్యం కీలకమని అన్నారు. వ్యవసాయ రంగంలో కూడా గేట్స్ ఫౌండేషన్ భాగస్వామ్యం రైతులకు ఎంతో



ప్రయోజనం కలిగిస్తుందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. టెక్నాలజీ ఆధారిత వ్యవసాయం, డ్రోన్ వినియోగం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత పంటల విశ్లేషణ వంటి విధానాలు రైతుల ఆదాయాన్ని పెంచడంలో సహాయపడతాయని చెప్పుకొచ్చారు. వ్యవసాయాన్ని లాభదాయక రంగంగా మార్చడంలో ఈ భాగస్వామ్యం ముఖ్య పాత్ర పోషిస్తుందని తెలిపారు. బిల్‌గేట్స్ అమరావతి పర్యటన ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న టెక్నాలజీ ఆధారిత పాలన, అభివృద్ధి కార్యక్రమాలు ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తున్నాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమగ్ర, స్థిర అభివృద్ధి లక్ష్యంతో ముందుకు సాగుతోందని వివరించారు. ఈ లక్ష్యాన్ని సాధించడంలో గేట్స్ ఫౌండేషన్ సహకారం కీలకమని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

### చంద్రబాబుతో బిల్‌గేట్స్ బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్

**శ్రీవారి విశిష్టతను వివరించిన చంద్రబాబు**
**ఇంట్లోని నిలువెత్తు విగ్రహం చూపించిన బాబు**
**వ్యవసాయ క్షేత్రం సదర్శించి పంటలపై ఆసక్తి**

అమరావతి : గేట్స్ ఫౌండేషన్ చైర్మన్ బిల్‌గేట్స్ సోమవారం అమరావతిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఏపీ ప్రభుత్వంపై బిల్‌గేట్స్ ప్రశంసలు కురిపించారు. 'నైస్, గుడ్, గ్రేట్ ప్రభుత్వ విధానాలు, కార్యక్రమాలంటూ గేట్స్ కొనియాడారు. గేట్స్‌పై ఉన్న గౌరవంతో మంత్రి నారా లోకేశ్‌తో సహా నలుగురు మంత్రులను సీఎం చంద్రబాబు గన్నవరం విమానాశ్రయానికి పంపించి స్వాగతం పలికారు. సచివాలయంలో మొదటి బ్లాకులో స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు బిల్‌గేట్స్‌కు ఆత్మీయ స్వాగతం పలికారు. సీఎం చంద్రబాబును చూడగానే కారు దిగుతూనే 'హలో ఫ్రెండ్...! హౌ ఆర్ యూ'.. అంటూ ముఖ్యమంత్రిని పలకరించారు గేట్స్. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో సహా ఇతర క్యాబినెట్ మంత్రులను బిల్‌గేట్స్‌కు సీఎం చంద్రబాబు పరిచయం చేశారు. బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్ సందర్భంగా తన ఛాంబర్‌లోకి వచ్చిన బిల్‌గేట్స్‌కు తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి నిలువెత్తు చిత్రపటాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు చూపించారు. శ్రీవారి ప్రాశస్త్యాన్ని, తిరుమల క్షేత్రం గొప్పదనాన్ని బిల్ గేట్స్‌కు వివరించారు సీఎం. గేట్స్ ఫౌండేషన్ బృందంతో బ్రేక్ ఫాస్ట్ మీటింగ్ అనంతరం ఆర్టీజీ సెంటర్‌కు గేట్స్‌ను

మిగతా 2వ పేజీలో..

## బిల్‌గేట్స్‌కు ఆహ్వానం పలకడం ఆనందం

- పలు రంగాల్లో ఆయనతో చర్చిస్తున్నాం
- ఎక్స్ వేదికగా ఐటిశాఖ మంత్రి లోకేశ్ వెల్లడి



**అమరావతి,ఫిబ్రవరి16 (చట్టం న్యూస్):** గేట్స్ ఫౌండేషన్ చైర్మన్ బిల్ గేట్స్ ఆంధ్రప్రదేశ్‌లో అడుగుపెట్టారు. ఈ సందర్భంగా సామాజిక మాధ్యమం ఎక్స్‌లో విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, ఆర్టీజీఎస్ శాఖల మంత్రి నారా లోకేశ్ ఆసక్తికర ట్వీట్ చేశారు. బిల్ గేట్స్‌కు అమరావతి హృదయపూర్వక స్వాగతం పలుకుతోందని ఆయన పేర్కొన్నారు. గన్నవరం విమానాశ్రయంలో బిల్ గేట్స్‌ను సహచర మంత్రులతో కలిసి సాదరంగా స్వాగతించడం ఆనందంగా ఉందని మంత్రి తెలిపారు. గేట్స్

మిగతా 2వ పేజీలో..

## నేటినుంచి హైటెక్స్ వేదికగా బయో ఏషియా సదస్సు

- రెండ్రోజుల పాటు జరుగనున్న అంతర్జాతీయ సదస్సు
- సదస్సును ప్రారంభించనున్న సిఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్,ఫిబ్రవరి16(చట్టం న్యూస్) :** తెలంగాణ ప్రభుత్వం ప్రపంచ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 23వ బయో ఏషియా 2026 అంతర్జాతీయ సదస్సు ఫిబ్రవరి 17 మంగళవారం నుండి భాగ్యనగరంలో
అట్టహాసంగా ప్రారంభం కానుంది. హైదరాబాద్‌లోని హైటెక్స్ వేదికగా రెండు రోజుల పాటు జరగనున్న ఈ సదస్సును రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు.ఈ ఏడాది సదస్సును 'టెక్‌బయో అన్‌లీష్డ్ ఏఐ, ఆటోమేషన్, జీవశాస్త్ర రంగంలో వస్తున్న విప్లవాత్మక పరిణామాలు' అనే ప్రధాన ఇతివృత్తంతో నిర్వహిస్తున్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానమైన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ), ఆటోమేషన్ వంటివి లైఫ్ సైన్సెస్ , హెల్త్‌కేర్ రంగాలను ఎలా ప్రభావితం చేస్తున్నాయనే అంశాలపై ఈ సదస్సులో లోతైన చర్చలు



జరగనున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుగా అంతర్జాతీయ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించి, అనంతరం సదస్సును ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఈ సదస్సులో పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తో పాటు అంతర్జాతీయ స్థాయి నిపుణులు పాల్గొంటారు. పెన్సిల్వేనియా యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మెడిసన్ ప్రొఫెసర్ ప్రొఫెసర్ బ్రూస్ ఎల్ లెవిన్, ఆమ్జెన్ చీఫ్ సైంటిఫిక్ ఆఫీసర్ డాక్టర్ హోవర్డ్ వై చాంగ్ పాల్గొననున్నారు. వీరితో పాటు 50కి పైగా దేశాల నుండి సుమారు 4,000 మంది ప్రతినిధులు, శాస్త్రవేత్తలు , ఫార్మా దిగ్గజాలు ఈ వేదికపై తమ అభిప్రాయాలను పంచుకోనున్నారు.రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో లైఫ్ సైన్సెస్ రంగానికి సంబంధించిన అనేక కీలక అంశాలతో పాటు నెక్స్ట్ జనరేషన్ బయోలాజిక్స్.. ఔషధ తయారీలో వస్తున్న నూతన మార్పులు. ఏఐ / డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్.. డేటా అనలిటిక్స్ , ఏఐ సాయంతో రోగ నిర్ధారణ, చికిత్స. తెలంగాణ రైజింగ్ 2047.. 2047 నాటికి తెలంగాణను వరల్డ్-క్లాస్ లైఫ్ సైన్సెస్ ఎకోసిస్టమ్‌గా మార్చే రోడ్‌మ్యాప్. ఆర్ / డీ (పరిశోధన).. గ్లోబల్ హెల్త్ ఇంపాక్ట్ , కొత్త వ్యాధుల చికిత్సకు అవసరమైన మౌలిక వసతులు వంటి వాటిపై చర్చాగోష్టులు నిర్వహించనున్నారు. ఈ సదస్సు ద్వారా హైదరాబాద్ నగరం ప్రపంచ లైఫ్ సైన్సెస్ మ్యాప్‌లో తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకోనుంది. లైఫ్ సైన్సెస్ రంగంలో సుమారు 9,000 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్, 175కి పైగా ప్రదర్శనకారులు ఈ సదస్సు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నారు. దేశంలోనే అతిపెద్ద 'టెక్‌బయో' హబ్‌గా తెలంగాణను తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఈ సదస్సు రూపుదిద్దుకుంది.

## రాజస్థాన్ ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదం

### ఏడుగురు వ్యక్తుల సజీవ దహనం

**జయపుర,ఫిబ్రవరి16 (చట్టం న్యూస్):** రాజస్థాన్‌లో భివాడీలోని ఓ రసాయన ఫ్యాక్టరీ లో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఏడుగురు సజీవ దహనమయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం తెల్లవారుజామున భివాడీలోని ఓ రసాయన ఫ్యాక్టరీలో ఒక్కసారిగా మంటలు ఎగసిపడ్డాయి. అనంతరం భారీ పేలుళ్లు సంభవించడంతో స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. ముందుజాగ్రత్త చర్యగా, సమీపంలోని కర్మాగారాల్లో పని చేస్తున్నవారిని ఖాళీ చేయించామన్నారు. ఈ ప్రమాదంలో సజీవదహనమైన ఏడుగురి మృతదేహాలను బయటకు తీసినట్లు అధికారులు పేర్కొన్నారు. మరికొందరు కార్మికులు

మిగతా 2వ పేజీలో..

## పౌరసేవల తీరు ప్రశంసనీయం

**మొదటి పేజి తరువాయి..**

గురించి కూడా ఈ సందర్భంగా బిల్‌గేట్స్ ఆరా తీశారు. బ్లడ్ ప్రెషర్, డయాబెటిస్ లాంటి పరీక్షల వివరాలను ఎలా నమోదు చేస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. కుప్పంలో అమలు చేసిన సంజీవని ప్రాజెక్టు చాలా చక్కగా ఉందని అభిప్రాయం వ్యక్తం చేస్తూ 'నైస్' అంటూ కొనియాడారు. ప్రజల డిజిటల్ హెల్త్ రికార్డులను అనుసరించి వారి లైఫ్‌స్టైల్, ఆహారం తదితర అంశాల్లో సలహాలు ఇస్తున్నామని అధికారులు తెలిపారు. ఏఐ వినియోగంతో ప్రజారోగ్య సేవలను మరింత మెరుగు పరిచేలా చూస్తున్నామని సీఎం వివరించారు. అందుకు బిల్‌గేట్స్ 'గ్రేట్' అంటూ కితాబిచ్చారు. ప్రజా రాజధాని అమరావతి నిర్మాణ వివరాలనూ బిల్‌గేట్స్ అడిగి తెలుసుకున్నారు. రాజధాని నిర్మాణ తీరును బిల్ గేట్స్‌కు ముఖ్యమంత్రి వివరించగా.. గ్రేట్ వర్క్ అంటూ కొనియాడారు.

## జెఇఇ మెయిన్ ఫలితాల విడుదల

**మొదటి పేజి తరువాయి..**

మొత్తంగా 12మంది విద్యార్థులు 100 పర్సంటైల్ స్కోరుతో అదరగొట్టారు. వీరిలో ఏపీ నుంచి నరేంద్రబాబు గారి మహిత్, పసల మోహిత్, తెలంగాణ నుంచి వివాన్ శరద్ మహిశ్వరి ఉన్నారు. మరోవైపు, జేఈఈ మెయిన్ మలి విడత పరీక్షకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతోంది. మొదటి విడత పరీక్షలో సాధించిన స్కోరుతో సంతృప్తి చెందని వారు రెండో విడత పరీక్షలు రాస్తుంటారు. ఏప్రిల్ 2 నుంచి 9వ తేదీ వరకు జేఈఈ మెయిన్ రెండో విడత పరీక్షలు జరుగుతాయి. ఈ రెండింటిలో ఉత్తమ స్కోరును పరిగణనలోకి తీసుకొని విద్యార్థులకు ర్యాంకులను కేటాయిస్తారు. ఆ తర్వాత సామాజిక వర్గాల వారీగా రిజర్వేషన్లకు అనుగుణంగా మొత్తం 2.50లక్షల మందిని జేఈఈ అడ్వాన్స్‌డ్ రాసేందుకు అర్హత కల్పిస్తారు. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో సత్తా చాటిన విద్యార్థులకు జోసా కౌన్సిలింగ్ ద్వారా ప్రతిష్ఠాత్మక ఐఐటీల్లో ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తుంటారు.

## బిల్‌గేట్స్‌కు ఆహ్వానం పలకడం ఆనందం

**మొదటి పేజి తరువాయి..**

ఫౌండేషన్ చైర్మన్ బిల్ గేట్స్‌తో ఆరోగ్యం, వ్యవసాయం, విద్య, సాంకేతిక ఆధారిత పరిపాలన రంగాల్లో భాగస్వామ్యాలను మరింత బలోపేతం చేసే అంశాలపై సచివాలయంలో చర్చిస్తున్నట్లు లోకేశ్ తెలిపారు. ప్రజలకు పటిష్టమైన, అత్యంత ప్రభావం కలిగించే పరిష్కారాలను అందించేందుకు గేట్స్ ఫౌండేషన్‌తో సన్నిహితంగా పనిచేయడానికి ఆంధ్రప్రదేశ్ ఎదురు చూస్తోందని మంత్రి లోకేశ్ తెలిపారు. గన్నవరం ఎయిర్‌పోర్టులో సహచర మంత్రులు వంగలపూడి అనిత, అచ్చెన్నాయుడు, సత్యకుమార్ యాదవ్‌లతో కలిసి బిల్ గేట్స్‌ను మంత్రి లోకేశ్ స్వాగతించారు.

## రష్యా నిర్ణయంపైనే బంగారం ధరలు

**మొదటి పేజి తరువాయి..**

డాలర్లలో వాణిజ్యాన్ని పునఃప్రారంభించినప్పుడే, ఇది జరుగుతుందని పేర్కొంటున్నారు. అంతర్జాతీయ విపణికి అనుగుణంగా దేశంలో గతేడాది బంగారం, వెండి ధరలు శరవేగంగా దూసుకెళ్లాయి. ఏడాది వ్యవధిలోనే బంగారం ధర 70 శాతానికి పైగా పెరిగి, గత నెలలో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1.80 లక్షలకు మించి గరిష్ఠస్థాయిని తాకినా, ప్రస్తుతం రూ.1.59 లక్షల వద్ద ఉంది. అంతర్జాతీయంగానూ ఔన్సు బంగారం ధర 5600 డాలర్లపైకి వెళ్లినా, మళ్లీ ఇప్పుడు 5000 డాలర్ల దగ్గర ట్రేడ్ అవుతోంది. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం ప్రారంభించాక, అంతర్జాతీయ అనిశ్చితులు పెరగడంతో, సురక్షితమని భావిస్తూ బంగారంపైకి పెట్టుబడులు వెల్లువెత్తుతుండటమే ధరల వృద్ధికి కారణం. ఆ రెండు దేశాల మధ్య శాంతి చేకూర్చాలని, వచ్చే జూన్ కల్లా యుద్ధాన్ని నిలిపివేయాలనే లక్ష్యంతో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఉన్నారు. ఇప్పటికే రష్యా అధ్యక్షుడు పుతిన్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో ఆయన సంప్రదింపులు జరిపారు. రష్యా చమురు కొనకుండా, భారత్ సహా పలు దేశాలపై భారీ సుంకాలు విధించడంతో, రష్యా కూడా దారికి వస్తున్న సూచనలున్నాయి. అమెరికాతో వాణిజ్య సంబంధాలు పునరుద్ధరించుకునేందుకు, అమెరికా డాలర్లలో వాణిజ్యం నిర్వహించేందుకు రష్యా సన్నాహాలు చేస్తున్నట్లు వార్తా ఏజెన్సీ బ్లూమ్‌బర్గ్ తెలిపింది. డాలర్‌కు ప్రత్యామ్నాయ కరెన్సీలు తేవాలన్న బ్రిక్స్ (బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికా) దేశాల సన్నాహాలకు ఇది పెద్ద ఎదురుదెబ్బే. రష్యా కనుక అంతర్జాతీయ వాణిజ్య సెటిల్‌మెంట్లను డాలర్లలో నిర్వహిస్తే, అమెరికా కరెన్సీకి ఊపొస్తుంది. పసిడిపై పెట్టుబడులు మళ్లీ డాలర్‌కు చేరతాయి. అప్పుడు కేంద్రబ్యాంకులూ బంగారం కొనడం ఆపేస్తాయి. అంతర్జాతీయ పసిడి నిల్వల్లో 20? బ్రిక్స్ దేశాల వద్దే ఉన్నాయని అంచనా. బ్రిక్స్ దేశాలతో అనుబంధం ఉన్న దేశాల నుంచే, అంతర్జాతీయ పసిడి ఉత్పత్తిలో 50? వాటా ఉంది. ఇప్పుడీ దేశాలన్నీ బంగారాన్ని ఉత్పత్తి చేస్తున్నా, అతి తక్కువగా మాత్రమే విక్రయిస్తున్నాయి. ధరలు పెరిగేందుకు ఇదీ కారణమైంది. ఇప్పుడు మళ్లీ డాలర్‌కు మద్దతు పెరిగితే, అమెరికా బాండ్లకు గిరాకీ వస్తుంది. అందువల్ల బంగారంపై పెట్టుబడులు ఉపసంహరించడం ప్రారంభిస్తే ఔన్సు ధర 2027 ఆఖరుకు 3,000 డాలర్లకు దిగిరావచ్చని సెబీ నమోదిత మార్కెట్ నిపుణులు అనుజ్ గుప్తా, అమిత్ గోయల్ వంటివారు పేర్కొంటున్నారు. ఇదే జరిగితే దేశీయంగా 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.90,000-1,00,000 వద్ద స్థిరపడొచ్చని అంచనా వేస్తున్నారు.

## రాజస్థాన్ ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదం

**మొదటి పేజి తరువాయి..**

మంటల్లో చిక్కుకున్నట్లు తెలుస్తోంది. అయితే ఎంతమంది ఉన్నారనే విషయంపై స్పష్టత రావాల్సిఉంది. ప్రమాదంలో రూ.లక్షలు విలువ చేసే వస్తువులు, యంత్రాలు బూడిదయ్యాయన్నారు. ఫ్యాక్టరీలో నిల్వ చేసిన గ్యాస్ సిలిండర్లు పేలడంతో ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు అనుమానం వ్యక్తంచేశారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. అగ్ని ప్రమాదంలో ఏడుగురు మృతి చెందడంపై ప్రధాని నరేంద్ర మోదీ (ఖఓ ఓనీటతి) విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. ఈ ఘటనలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ ప్రమాదంపై ముఖ్యమంత్రి భజన్ లాల్ శర్మ దిగ్భ్రాం÷-రతి వ్యక్తంచేశారు. ఈ ఘటనలో గాయపడిన వారికి మెరుగైన వైద్య చికిత్స అందించాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు.

## తొలగిన చెత్తా చెదారం

**కొడిమ్యాల, ఫిబ్రవరి 16(చట్టం) :** మండల కేంద్రంలోని చిలుకవాగు కాల్వలో గత కొన్ని నెలలుగా పేరుకుపోయిన మట్టి, చెత్తా చెదారం తొలగిపోయి శుభ్రంగా మారింది. నూతన సర్పంచ్ గడ్డం జీవన్ రెడ్డి ఈ కాలువపై ప్రత్యేక చొరవ తీసుకొని కాల్వను శుభ్రం చేయించడం జరిగింది. శుభ్రం చేయడంతో పరిసర ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



# బిల్‌గేట్స్ పర్యటనతో ఏపికి పెరిగిన ప్రాధాన్యత





**మొదటి పేజి తరువాయి..**

తీసుకెళ్లారు ముఖ్యమంత్రి. తర్వాత ఆ విభాగం పనితీరును వివరించారు. పాలనా వ్యవహారాలు, విపత్తుల్లో ప్రజలకు నాణ్యమైన సేవలు అందించే విషయంలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీని ఏ విధంగా వినియోగించుకుంటున్నా మనే అంశాన్ని ఉదాహరణలతో సహా వివరించారు ముఖ్యమంత్రి. గేట్స్ ఫౌండేషన్ భాగస్వామ్యంతో కుప్పంలో చేపట్టిన సంజీవని ప్రాజెక్టు ప్రోగ్రెస్‌ను ముఖ్యమంత్రి వివరించగా.. దట్స్ నైస్ అంటూ మెచ్చుకున్నారు బిల్ గేట్స్. ఆరోగ్య రంగంలో ఏఐ వినియోగంపై గ్రేట్ అంటూ గేట్స్ అభినందనలు తెలిపారు. డేటా లేక్, వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా పౌర సేవలను సులభతరం చేయడంపై బిల్ గేట్స్ హర్షం వ్యక్తం చేశారు. వ్యాధి నిర్ధారణ పరీక్షలు తక్కువ ధరకే అందించగలిగితే.. పేదలకు ఎంతో మేలు చేకూరుతుందని బిల్ గేట్స్ అభిప్రాయపడ్డారు. అమరావతి రాజధాని ప్రణాళికలను.. బ్లూ-గ్రీన్ కాన్సెప్ట్‌ను, అత్యాధునిక పద్ధతుల్లో ఫ్యూచర్ సిటీగా నిర్మిస్తున్న విధానాన్ని తెలుసుకున్నారు. గ్రేట్‌వర్క్ అంటూ రాజధాని మాస్టర్ ఎ÷-లాన్‌ను మెచ్చుకున్నారాయన. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఎలాంటి ప్రణాళికలతో రాజధాని నిర్మిస్తున్నామనే విషయాన్ని వివరించారు సీఎం. రాజధాని ప్రాంతంలో మొత్తంగా గ్రీన్ ఎనర్జీనే వినియోగించే దిశగా.. ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లు బిల్ గేట్స్‌కు చెప్పారు సీఎం. అనంతరం మంత్రులు, సెక్రటరీల సమావేశానికి గేట్స్‌ను తీసుకొచ్చారు సీఎం చంద్రబాబు. ప్రభుత్వ పాలసీలు, కార్యక్రమాలు, లక్ష్యాలపై ప్రజెంటేషన్ ఇచ్చారు. అలాగే ఉండవల్లిలోని వ్యవసయా క్షేత్రాన్ని పరివృలించారు. అక్కడ పండించిన పంటలను పరిశీలించి అభినందించారు.

# కొలువుదీరిన పురపాలక 'పాలకులు': నూతన మేయర్, చైర్మన్లకు మంత్రి పొంగులేటి శుభాకాంక్షలు

**ఖమ్మం బ్యూరో (చట్టం న్యూస్) పిబ్రవరి 16 :** ఖమ్మం : ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీలకు నూతనంగా ఎన్నికైన మేయర్, చైర్మన్లతో పాటు, డిప్యూటీ మేయర్, వైస్ చైర్మన్లు , నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన కౌన్సిలర్లు, కార్పొరేటర్లకు తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు .ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ఈ నూతన సారథులు ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ పట్టణాల అభివృద్ధిలో క్రియాశీలక పాత్ర పోషించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు.


FILE PHOTO

కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ తొలి మేయర్‌గా బాధ్యతలు చేపట్టిన మూడ్ గణేష్ (సీపీఐ), డిప్యూటీ మేయర్‌గా ఎన్నికైన సిరిపురపు లలిత (కాంగ్రెస్)లకు మంత్రి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. వీరితో పాటు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లను ఆయన అభినందించారు. మధిర మున్సిపల్ చైర్మన్ సామినేని సుజాత, వైస్ చైర్మన్ కోట ధనమూర్తి, సత్తుపల్లి చైర్మన్ రెహానా బేగం, వైస్ చైర్మన్ బొంతు సుమలత, వైరా చైర్మన్ కాపా చంద్రకళ, వైస్ చైర్మన్ కట్ల సంతోష్, అశ్వారావుపేట చైర్మన్ జూపల్లి శశికళ, వైస్ చైర్మన్ జూపల్లి రమేష్, ఏదులాపురం చైర్మన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, కల్లూరు మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్, వైస్ చైర్మన్ శీలం కోటేశ్వరిలకు మంత్రి పొంగులేటి శుభాకాంక్షలు తెలుపుతూవారంతా ప్రజలకు అందుబాటులో ఉంటూ ఆదర్శవంతమైన పాలన అందించాలని సూచించారు.

పట్టణాల్లోని ప్రతి వార్డు, డివిజన్ అభివృద్ధి చెందాలంటే కౌన్సిలర్లు, కార్పొరేటర్లతో కూడిన పూర్తి పాలకవర్గం పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా వార్డులు, డివిజన్లలోని మౌలిక సదుపాయాల కల్పన, పారిశుధ్యం, తాగునీటి సమస్యల పరిష్కారమే ధ్యేయంగా నూతన పాలకవర్గాలు పనిచేయాలని ఆయన సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పట్టణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని మంత్రి పొంగులేటి హామీ ఇచ్చారు.

# హైదరాబాద్ రామంతాపూర్ మినీ ట్యాంక్ బండ్ వద్ద సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి వేడుకలు....

**ఉప్పల్,16 ఫిబ్రవరి (చట్టం) :** హైదరాబాద్ నగరంలోని రామంతాపూర్ వరంగల్ జాతీయ రహదారి సమీపంలోని మినీ ట్యాంక్ బండ్ వద్ద బంజారా/లంబాడాల ఆరాధ్య దైవం, దేశం గర్వించదగ్గ మహానుభావుడు సంత్ శ్రీ సద్గురు సేవాలాల్ మహారాజ్ గారి 287వ జయంతి వేడుకలు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించబడ్డాయి. హబ్సిగూడ డివిజన్ పరిధిలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రాంతీయ నాయకులు, సామాజిక కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

ఈ జయంతి వేడుకలకు ముఖ్య అతిథిగా పద్మశ్రీ కేతావత్ సోమ్లాల్ గారు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనతో పాటు డి.డి. తారచంద్ నాయక్, రైల్వే రాములు నాయక్, లంబాడి ఐక్య వేదిక రాష్ట్ర కార్యదర్శి మాలు నాయక్, బీజేపీ రాష్ట్ర పబ్లిసిటీ సెల్ కన్వీనర్ బి.పి. నాయక్, హబ్సిగూడ డివిజన్ బీజేపీ నాయకులు కానావత్ రాజు నాయక్, పృథ్వీ నాయక్, ధనావత్ రాము నాయక్, తేజవత్ సురేష్ నాయక్, ధనావత్ లింగం నాయక్, వినోద్ నాయక్, వెంకట్ నాయక్, రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు. సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆయన సమాజ సేవలు, ఆధ్యాత్మిక బోధనలు, బంజారా సమాజ అభివృద్ధికి చేసిన కృషిని ప్రముఖులు కొనియాడారు. సమాజంలో ఐక్యత, సేవా భావం, ధర్మ పరిరక్షణకు ఆయన చూపిన మార్గం నేటి తరానికి ఆదర్శమని వారు పేర్కొన్నారు.



# పెండింగ్‌లో ఉన్న ఆసరా పెన్షన్లు పూర్తిచేయాలి

### ధనియాకుల వెంకటనారాయణ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్.



**ఖమ్మం బ్యూరో (చట్టం న్యూస్) పిబ్రవరి 16 :** ఈ తెలంగాణ రాష్ట్రంలో ఆసరా పెన్షన్లు కోసం వయోవృద్ధులు, దివ్యాంగులు ఒంటరి మహిళలు. ఎదురు చూస్తున్నారని 25 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, గతరెండేళ్లలో 2 లక్షల పింఛన్లు రద్దు చే య్ ం బ డ్డా య్ ం ని . దరఖాస్తుదారులు ఆఫీసుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్న అధికారులు పట్టించుకోవడం లేదని. కొత్త పింఛన్లు ఇవ్వకుండా పాత పింఛన్లను పెంచకుండా. 2023-24 లెక్కల ప్రకారం 44,49,767 పింఛను దరఖాస్తులు పెండింగ్లో ఉన్నాయని. 2024, 2025లో రెండు దఫాలుగా కొత్తగా 24.88 లక్షల దరఖాస్తులు స్వీకరించారని. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుకు ముందు హామీల లో దివ్యాంగుల ఆసరా పింఛన్లను రూ.6,116కు, మిగతా పింఛన్లను రూ.4,116కు పెంచుతామని హామీ ఇచ్చి ఇప్పుడు ఇబ్బంది పెడుతున్నారని,. అర్హులైన వారందరికీ ప్రభుత్వం ఆసరా పింఛన్లు ఇవ్వాలి పాత పెన్షన్లను పెంచాలని , ఖమ్మం బిజెపి టూ టౌన్ అధ్యక్షులు ధనియాకుల వెంకటనారాయణ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు, ---------

# సృజనాత్మక కళాఖండాలు

**కొడిమ్యాల, ఫిబ్రవరి 16(చట్టం) :** జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల కేంద్రానికి చెందిన ముమ్మాడి విశ్వక్ ఇంటర్మీడియట్ విద్యార్థి బాల్యం నుండి చిత్రలేఖనంపై గల ఆసక్తితో పలురకాల చిత్రాలు గీయడంతో పాటు వ్యర్థాలతో (వేస్ట్ టు బెస్ట్) పలురకాల నమూనాలు తయారు చేసి తన సృజనాత్మకతను చాటుకుంటున్నాడు. విశ్వక్ గతంలో ఈనాడు దినపత్రిక ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతిభా పాటవ చిత్రలేఖనం పోటీలలో మొదటి స్థానంలో నిలిచి బహుమతిని గెలుచుకున్నాడు. కళల్లో కొన్ని..నీటి రంగులతో చేతి రుమాలుపై జాతిపిత మహాత్మాగాంధీ, ముగ్గు రంగులతో నేలపై గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్, పెన్సిల్ తో సినీనటులు అల్లు అర్జున్, విజయ్ దేవరకొండ చిత్రాలు. (వ్యర్థాలు)మట్టి, కాగితం గుజ్జుతో వినాయకులు, కాగితం అట్టలతో పెద్దపులి తల తదితర కళాఖండాలు తయారు చేసి పలువురిని ఆకట్టుకుంటున్నాడు.



# కార్పొరేషన్ లో అవినీతి జరగకుండా విజిలెన్స్ సెల్ ఏర్పాటు చేస్తాం..

- చిన్న అవినీతి జరిగినా బిజెపిని విడిచి పెట్టే ప్రసక్తే లేదు..
- బిజెపి పాలకవర్గం పారదర్శకంగా పాలన సాగించాలి..
- ప్రతి డివిజన్లో అభివృద్ధి పనులు బిల్డింగ్ పర్మిషన్లపై నిఘా పెడతాం..
- ప్రజల పక్షాన నిలుస్తాం..
- అవినీతి అక్రమాలు జరగకుండా చూస్తాం..
- కరీంనగర్ అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు తీసుకొస్తా..
- అవినీతికి పాల్పడ్డ వారే మేయర్ డిప్యూటీ మేయర్ గా ఎన్నికయ్యారు..
- కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు ;




**ఉమ్మడి కరీంనగర్ జిల్లా/ ఫిబ్రవరి 16 ,(చట్టం బ్యూరో) :** కరీంనగర్ నగర పాలక సంస్థలో కొత్తగా ఏర్పడిన బిజెపి పాలకవర్గం ఎలాంటి అవినీతి అక్రమాలకు పాల్పడకుండా నిరంతరం పర్యవేక్షణ చేసేందుకు ఒక ప్రత్యేక నిఘా వ్యవస్థ విజిలెన్స్ సెల్ ఆర్గనైజేషన్ ను ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు పేర్కొన్నారు. అక్రమాలకు పాల్పడిన కార్పొరేటర్ మేయర్ గా, మేయర్ గా పని చేస్తున్న వ్యక్తి డిప్యూటీ మేయర్ గా ఎన్నిక కావడం పట్ల ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారని తెలిపారు. సోమవారం సాయంత్రం కరీంనగర్ డిసిసి కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లతో కలిసి వెలిచాల రాజేందర్ రావు విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజేందర్రావు మాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్ లో చిన్న అవినీతి జరిగినా విడిచిపెట్టే ప్రసక్తి లేదని ప్రతి డివిజన్లో జరిగే అభివృద్ధి పనులు బిల్డింగ్ పర్మిషన్లు ఇతరత్రా పనులపై పర్యవేక్షణకు ప్రత్యేక విజిలెన్స్ ఆర్గనైజేషన్ ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. ప్రతి పని ప్రతి పేమెంటు మానిటరింగ్ చేసి నాణ్యత పరిశీలించి ప్రభుత్వం బిల్లులు చెల్లించేలా కృషి చేస్తామన్నారు. ప్రజలను అవినీతి అక్రమాల నుంచి కాపాడుతామని స్పష్టం చేశారు. బిజెపి పాలకవర్గం అవినీతి అక్రమాలకు పాల్పడకుండా నిరంతరం నిఘా పెడతామని తేడాలు వస్తే ముఖ్యమంత్రి మంత్రుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకునేలా కృషి చేస్తామని చెప్పారు. ప్రజలకు పారదర్శకమైన పాలన అందించాలని బిజెపి పాలకవర్గం జాగ్రత్తగా ప్రజలకు సేవలు అందించాలన్నారు. గత బిఆర్ఎస్ హాయంలో జరిగినట్లు అవినీతి అక్రమాలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. నాడు కేంద్రమంత్రి బండి సంజయ్ సునీల్ రావు అవినీతిపరుడని అనేకసార్లు విమర్శించి పార్టీలో చేర్చుకున్నారని ఆరోపించారు. నాడు విమర్శించి నేడు మళ్ళీ డిప్యూటీ మేయర్గా ఎంపిక చేయడంపై ప్రజలంతా గమనిస్తున్నారని తెలిపారు. అవినీతిపరులను పార్టీలో చేర్చుకొని మళ్లీ పదవులు ఇవ్వడం పట్ల విస్మయం కలుగుతుందన్నారు. కార్పొరేషన్ లో కాంగ్రెస్ ప్రధాన ప్రతిపక్ష పార్టీకి అవతరించినా కరీంనగర్ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తామని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా ఇన్చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జిల్లా మంత్రులు శ్రీధర్ బాబు పొన్నం ప్రభాకర్ సహకారంతో కరీంనగర్ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా పెద్ద ఎత్తున నిధులు తెస్తానని పేర్కొన్నారు. ఎవరు చేయని విధంగా ఏ ఎమ్మెల్యే తేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయిస్తానని రాజేందర్ రావు తెలిపారు. కరీంనగర్ లో అవినీతికి ఆస్కారం లేకుండా క్లీన్ గా పాలన సాగించేలా నిరంతరం పర్యవేక్షణ చేస్తామన్నారు. ప్రతి అభివృద్ధి పనిపై మానిటరింగ్ చేసి బిల్లులు ఇప్పించేలా చూస్తామన్నారు. గతంలో జరిగిన అవినీతి అక్రమాలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకునేలా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని స్పష్టం చేశారు. కార్పొరేషన్ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలుకు కట్టుబడి పని చేస్తామన్నారు. ప్రతి వార్డులో అభివృద్ధి పనులు బిల్డింగ్ పర్మిషన్లు ఇతరత్రా ప్రజా అవసరాలకు ఎలాంటి డబ్బులు ఆశించకుండా బిజెపి పాలకవర్గం పనిచేయాలని సూచించారు. ఒకవేళ అవినీతి అక్రమాలకు పాల్పడితే మాత్రం ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ విషయంలో జాగ్రత్తగా అప్రమత్తంగా బిజెపి పాలకవర్గం పనిచేయాలని సూచించారు. కరీంనగర్ రైసింగ్ ఆర్గనైజేషన్ పేరిట ప్రతి డివిజన్లో ముగ్గురు వ్యక్తులతో కలిసి కమిటీని ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ప్రతి డివిజన్లో జరిగే అభివృద్ధి పనులు బిల్డింగ్ పర్మిషన్లు ఇతరత్రా పనులకు సంబంధించి పర్యవేక్షణ చేస్తుందన్నారు. ప్రజల పక్షాన ఉండి ప్రజలకు మేలు జరిగేలా చూస్తామన్నారు. కరీంనగర్ ప్రజలకు 24 గంటల పాటు అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. ఎన్నికల్లో చెప్పినట్లు మేనిఫెస్టో ప్రకారం కరీంనగర్ అభివృద్ధికి కృత నిశ్చయంతో ముందుకు సాగుతామని పేర్కొన్నారు.

ఈ విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు ఆకుల నర్మదా నర్సన్న, భాస్కర్ నాయక్ గుమ్మడి రాజకుమార్, ఆకుల నందిని ఉదయ్, పడిశెట్టి వసంత లక్ష్మి భూమయ్య, కల్లేపల్లి శారద బాలరాజు, సికిందర్ ఇక్రమ్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# కల్లుగీత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 17న జరిగే నిరాహార దీక్షను జయప్రదం చేయండి

### జిల్లా అధ్యక్షులు ఆశన్న గౌడ్




**అందోల్ మండల్ ప్రతినిధి ఫిబ్రవరి 16 (చట్టం)న్యూస్ :** సంగారెడ్డి లోని ప్రజా సంఘాల కార్యాలయంలో. జిల్లా అధ్యక్షులు ఆశన్న గౌడ్. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జంగన్న గౌడ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్ కలిసి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కల్లు గీతా కార్మికులకు గౌడ సోదరులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని. బడ్జెట్లో గౌడ కులస్తుల సంక్షేమం కోసం గీత కార్మికుల ఉపాధి కోసం 5000 కోట్లు మంజూరు చేయాలని కోరుతూ ఈనెల 17న హైదరాబాదులోని ఇందిరాపార్కు వద్ద కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిరాహారదీక్ష నిర్వహించడం జరుగుతుందని ఈ యొక్క నిరాహార దీక్షకు జిల్లా లోని గౌడ సోదరులు గీతా కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం గీత కార్మికులకు కొత్త పెన్షన్లు మంజూరు చేయడం లేదని. ఇచ్చినవారికి 4000 పెన్షన్ చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని.. దరఖాస్తు చేసుకున్న గీత కార్మికులందరికీ కొత్త పెన్షన్ మంజూరు చేయాలి. పెండింగ్ లో ఉన్న ఎనిమిది వందల మందికి సుమారు 14 కోట్ల ఎక్స్గ్రేషియాను వెంటనే విడుదల చేయాలని. గత బడ్జెట్లో కేటాయించిన 70 కోట్ల నిధులను వెంటనే విడుదల చేసి ఖర్చు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గీత కార్మికుల ఉపాధి కోసం గౌడ కులస్తుల సంక్షేమం కోసం జరిగే ఈ నిరాహార దీక్షలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

------

# పురపాలిక చైర్మన్గా తడక వెంకటేశ్వర్లు , వైస్ చైర్మన్ గా కొయ్యడ రజని ఎన్నిక





**భూదాన్ పోచంపల్లి ; ఫిబ్రవరి 16 (చట్టం ప్రతినిధి ) :** భూదాన్ పోచంపల్లి చైర్మన్ వైస్ చైర్మన్ ల ఎన్నిక సర్వత్ర ఉత్కంఠగా కొనసాగింది . ఉదయం 11 గంటలకు 13 వార్డు సభ్యులకు గాను అందరూ హాజరయ్యారు . జిల్లా పంచాయతీ అధికారి విష్ణువర్ధన్ రెడ్డి మొదటగా ఎన్నికైన సభ్యులచే ప్రమాణ స్వీకారం చేపట్టారు . 12:30 గంటలకు చైర్మన్ వైస్ చైర్మన్ ల ఎన్నిక ప్రక్రియ ప్రారంభించారు . చైర్మన్ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ తరపున తడక వెంకటేశ్వర్లు పేరును 8 వ వార్డు కౌన్సిల్ సభ్యుడు దేవరాయ కుమార్ ప్రతిపాదించగా 3 వ కౌన్సిల్ సభ్యుడు రావుల జంగయ్య బలపరిచారు . బారాస తరపున చైర్మన్ అభ్యర్థిగా కుడికాల అఖిలకు 4వ వార్డు కౌన్సిలర్ చక్రపాణి ప్రతిపాదించగా 5వ వార్డు కౌన్సిలర్ బాత్ కా లింగస్వామి బలపరిచారు . దీంతో ఎన్నిక చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ చైర్మన్ అభ్యర్థి తడాఖా వెంకటేశ్వర్లు కు ఆరుగురు కాంగ్రెస్ అభ్యర్థులు భాజపా స్వతంత్ర అభ్యర్థులు చేతులు లేపి మద్దతు తెలిపారు . బారాస పార్టీ చైర్మన్ అభ్యర్థి కుడికాల అఖిల కు బారాసకు చెందిన ఐదుగురు అభ్యర్థులు చేతులు లేపి మద్దతు తెలిపారు . దీంతో పురపాలిక చైర్మన్ అభ్యర్థిగా తడక వెంకటేశ్వర్లు ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించారు . అనంతరం వైస్ చైర్మన్ పదవి కోసం కాంగ్రెస్ పార్టీ తరపున కొయ్యడ రజనిని కొండమడుగు ఎల్ల స్వామి ప్రతిపాదించగా జినుకల లావణ్య బలపరిచింది బారాస పార్టీ తరపున వైస్ చైర్మన్ పదవికి ఎవరు ప్రతిపాదించకపోవడంతో వైస్ చైర్మన్ ఎన్నిక ఏకగ్రీవం అయింది . అనంతరం చైర్మన్ వైస్ చైర్మన్ ల తో ప్రమాణ స్వీకారం చేయించారు . కార్యక్రమంలో తాహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి పురపాలక సిబ్బంది పాల్గొన్నారు .

# బోయిన్ పల్లి లో బీజేపీ సంబురాలు



**బోయిన్ పల్లి మండలం / ఫిబ్రవరి 16 ,(చట్టం న్యూస్) :** కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ మేయర్ పదవిని కైవసం చేసుకుంది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రివర్యులు, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు శ్రీ బండి సంజయ్ కుమార్ నాయకత్వంలో పార్టీ ఘన విజయం సాధించింది. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు ఎడపల్లి పరశురామ్ మాట్లాడుతూ, “కరీంనగర్ ప్రజలు అభివృద్ధికి ఓటు వేశారు. పారదర్శక, బాధ్యతాయుత పాలన కోసం బీజేపీని ఆశీర్వదించారు. ప్రజల ఆశయాలను నెరవేర్చేందుకు పార్టీ కట్టుబడి ఉంది” అని పేర్కొన్నారు. విజయోత్సవాల సందర్భంగా కార్యకర్తలు టపాసులు ఏర్పాటు చేసి మండలవ్యాప్తంగా సంబరాలు నిర్వహించి స్వీట్లు పంపిణీ చేశారు. పార్టీ శ్రేణులు ఈ విజయాన్ని ప్రజల గెలుపుగా అభివర్ణించాయి. గౌరవనీయ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అభివృద్ధి దిశను అనుసరిస్తూ, కరీంనగర్ను సమగ్ర అభివృద్ధి దిశగా తీసుకెళ్లడం పార్టీ లక్ష్యమని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఉదారి నర్సింహ చారి, మాజీ మండల అధ్యక్షులు గుడి రవీందర్ రెడ్డి సీనియర్ నాయకులు కొండం శ్రీనివాస్ రెడ్డి మారం ఉపేందర్ మెరుపుల గంగాధర్ గౌడ్ , భోగి గంగాధర్ చారి మిరియాల శరత్ చంద్ర రెడ్డి మినుకుల శ్రీనివాస్, వెంకటేష్, ఇల్లందుల బాలయ్య ,జనగామ లక్ష్మణ్, సారంపల్లి రాజు, కొనుకటి హరీశ్, కళ్యాణం అనిల్, ఐలయ్య చంద్రయ్య, మహేష్ , నాగరాజు, అనిల్, విజయేందర్ రెడ్డి, నిఖిల్ ఆవుల లక్ష్మణ్, ఆంజనేయులు, బుర్ర ప్రదీప్, వంశీ, అఖిల్, మహేందర్,నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మేడిపల్లిలో “శ్రీ ఈశ్వరా జోలరీ” 1 గ్రాము గోల్డ్ షాప్ ఘన ప్రారంభం...




**మేడిపల్లి,16 ఫిబ్రవరి (చట్టం) :** మేడిపల్లి పి.అండ్ టి కాలనీ పార్క్ ఎల్లమ్మ గుడి సమీపంలో “శ్రీ ఈశ్వరా జోలరీ” పేరుతో 1 గ్రాము గోల్డ్ షాప్‌ను ఈ రోజు ఘనంగా ప్రారంభించారు. వరంగల్ హైవే పిల్లర్ నంబర్ 96, రోడ్ నంబర్ 1 వద్ద ఏర్పాటు చేసిన ఈ దుకాణాన్ని స్థానిక ప్రముఖుల చేతుల మీదుగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, మేడిపల్లి మరియు బోడుప్పల్ ప్రాంతాల మహిళలకు తక్కువ ధరల్లో, అన్ని వేళలా అందుబాటులో ఉండేలా 1 గ్రాము గోల్డ్ ఆభరణాలు అందించడమే తమ లక్ష్యమని తెలిపారు. సరసమైన ధరలు, నాణ్యమైన వస్తువులతో వినియోగదారుల విశ్వాసాన్ని సంపాదించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రముఖులు హాజరై దుకాణ యజమానులను అభినందించారు. ముఖ్యంగా పీఎంసీ మాజీ మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీలత బద్రు నాయక్, డాక్టర్ మూడవత్ సంజీవ్ చౌహన్,మూడవత్ పాండు నాయక్, డి. బిక్షపతి నాయక్ తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

స్థానిక ప్రజలు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై కొత్త షాప్ ప్రారంభాన్ని స్వాగతించారు. ఈ దుకాణం ద్వారా ప్రాంతీయ మహిళలకు తక్కువ ధరల్లో ఆభరణాలు లభించడం సంతోషకరమని వారు పేర్కొన్నారు.

## రాంపల్లి డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహణ...




**రాంపల్లి,16 ఫిబ్రవరి (చట్టం) :** రాంపల్లి డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో మహాశివరాత్రి వేడుకలు భక్తిశ్రద్ధలతో, ఐక్యతా భావంతో ఘనంగా నిర్వహించబడ్డాయి. 6240 కుటుంబాలు నివసిస్తున్న ఈ కాలనీలో అన్ని మతాల ప్రజలు, ముఖ్యంగా హిందూ కుటుంబాలు కలిసి శివరాత్రి జాగారం నిర్వహించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ఈ సందర్భంగా పిల్లలు, మహిళలు, పెద్దలు సహా కుటుంబ సభ్యులంతా భక్తి భావంతో పాల్గొని ప్రత్యేక పూజలు, భజనలు, జాగారం కార్యక్రమాలు నిర్వహించారు. కాలనీలోని దేవాలయం ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడగా, భక్తుల ఐక్యత వేడుకలకు మరింత శోభను చేకూర్చింది. వేడుకలను విజయవంతంగా నిర్వహించడంలో కాలనీ నివాసుల సహకారం ప్రశంసనీయమని 2దీఎఖ రాంపల్లి దేవాలయ కమిటీ సభ్యులు తెలిపారు. అందరి ఐక్యత, సహకారం మరియు భక్తి వల్ల కార్యక్రమం శాంతియుతంగా, ఘనంగా సాగిందని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా దేవాలయ కమిటీ తరఫున కార్యక్రమానికి సహకరించిన ప్రతి కుటుంబ సభ్యునికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో కూడా కాలనీలో ఐక్యత, సౌహార్దత, సోదరభావం ఇలాగే కొనసాగాలని వారు ఆకాంక్షించారు.

రాంపల్లి డబుల్ బెడ్‌రూమ్ కాలనీ నివాసుల ఐక్యతకు ఈ మహాశివరాత్రి వేడుకలు నిలువెత్తు నిదర్శనంగా నిలిచాయి.

## రాంపల్లి డబుల్ బెడ్‌రూమ్ కాలనీకి RTC బస్సు సర్వీస్ కొనసాగించాలి

### ఆర్‌ఆర్‌ఆర్‌టీఆర్‌వీ సోషల్ వెల్ఫేర్ ఫౌండేషన్ వినతి...






**రాంపల్లి,16 ఫిబ్రవరి (చట్టం) :** రాంపల్లి డబుల్ బెడ్‌రూమ్ కాలనీ ప్రజల రవాణా సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఆర్ టీ సి బస్సు సర్వీస్‌ను నిలిపివేయకుండా కొనసాగించాలని ఆర్‌ఆర్‌ఆర్‌టీఆర్‌వీ సోషల్ వెల్ఫేర్ ఫౌండేషన్ సభ్యులు ప్రభుత్వ అధికారులకు వినతి చేశారు. కాలనీలో నివసిస్తున్న సుమారు 6,240 కుటుంబాల తరఫున ఈ అభ్యర్థనను సమర్పించారు. కాలనీ స్థాపన జరిగినప్పటి నుండి సరైన రోడ్డు కనెక్టివిటీ లేకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. ప్రస్తుతం రోడ్డు అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, ఈ పనుల కోసం ఈ-టెండర్ నోటీసు కూడా జారీ చేసినట్లు పేర్కొన్నారు. రోడ్డు సమస్య పూర్తిగా పరిష్కారం అయ్యే వరకు కనీసం మరో నెలపాటు బస్సు సర్వీస్‌ను కొనసాగించాలని కోరారు. రోడ్డు పరిస్థితులు మరియు జరుగుతున్న పనులపై సందేహాలు ఉంటే కాలనీ ఇన్‌చార్జ్‌గా ఉన్న ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీ సురేంద్రనాథ్ పర్యవేక్షణలో పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. కాలనీ ఇంకా పూర్తిగా హ్యాండోవర్ కాలేదని, అభివృద్ధి పనులు కొనసాగుతున్న నేపథ్యంలో ప్రజల రవాణా అవసరాలను దృష్టిలో ఉంచుకుని బస్సు సర్వీస్ నిలిపివేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రజల విద్య, ఉపాధి, వైద్య అవసరాలకు బస్సు సౌకర్యం అత్యంత కీలకమని కాలనీ వాసులు పేర్కొన్నారు. అధికార యంత్రాంగం స్పందించి ప్రజల ప్రయోజనార్థం ఆర్ టీ సి బస్సు సర్వీస్‌ను కొనసాగించాలని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

# పక్కా నీటి ప్రణాళికలే మేలు !

పోలవరం సహా అనేక ప్రాజెక్టులు ఇంకా పూర్తికాలేదు. పోలవరం పన్నెండేళ్లుగా నానుతోంది. నాలుగైదే ళ్లలో పూర్తి చేయాల్సిన ప్రాజెక్ట్ ఇంకా పూర్తి కాలేదు. ఏయేటి కాయేడు నిర్మణ ఖర్చు తడిసి మోపెడు అవుతోంది. రాయలసీమతో సహా అనేక ప్రాజెక్టులు పూర్తి కావాల్సి ఉంది. వాటి గురించి పట్టించుకోకుండా కొత్తగా నల్లమలసాగర్ పేరుతో చంద్రబాబు ఇరు రాష్ట్రాల మధ్య చిచ్చు పెట్టడం వెనక పెద్ద వ్యూహం ఉండివుంటుంది. తెలంగాణలో కూడా కాళేశ్వరంను తిడుతూ రెండేళ్లుగా కాలయాపన చేస్తూ వస్తున్నారు. ఎన్నికల్లో గెలవడంతో తమకు ప్రజల మద్దతు ఉందని చెప్పుకోవడం ద్వారా ప్రజల దృష్టిని మరల్చలేరు. ఇక్కడా అనేక ప్రాజెక్టులు పూర్తి కావాల్సి ఉంది. వాటిని పూర్తి చేసేందుకు రేవంత్ ప్రభుత్వం సంకల్పం ప్రకటించాలి. అంతే తప్ప ఎంతసేపు ఎన్నికలు, ఫలితాలు వంటివాటితో పొంగిపోరాదు. నీటిని వాడుకోవడం ఎలా అన్న దానిపై ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలు కసరత్తు చేయాలి. వ్యవసాయరంగంలో విప్లవం సాధించా లంటే నీటి యాజమాన్యం కూడా ముఖ్యం. ఇకపోతే రెండేళ్ల యినా చేయాల్సిన పనులు చేయకుండా ఎంతసేపు జగన్‌ను ఆడిపోసుకోవడంతోనే కలం గడిపేస్తున్నారు. అలాగే 2027 జూన్ కంటే ముందే పోలవరం జాతికి అంకితం చేస్తామన్నది తొలి కార్యాచరణ కావాలి. ఆ ప్రాజెక్టు పూర్తి చేశాక నదుల అనుసంధానం చేపడతా మని, పోలవరం నుంచి నీటిని నల్లమల సాగర్‌కు తీసుకెళ్తామని పేర్కొన్నారు. పెండింగ్ ప్రాజెక్టులపై ప్రాధాన్యత ఇవ్వకుండా లేని ప్రాజెక్టుతో వివాదాలు సృష్టించడం, కేంద్రంపై ఒత్తిడి తేవడం వంటివన్నీ అనవసర విన్యాసాలు తప్ప మరోటికాదు. ఇరు రాష్ట్రాల మధ్య సయోధ్యతో ముందుకు సాగాల్సిన అసవరం ఉంది. ఒకప్పుడు తాను ఉమ్మడి ఎపికి సిఎంగా చేశానని గుర్తించి చంద్రబాబు నడవాల్సి ఉంది. అంతేగాక వివాదాస్పదంగావున్న నల్లమల సాగర్ మాట ఇప్పుడు చెప్పడం ద్వారా తెలుగు రాష్ట్రాల మధ్య సఖ్యత, సౌభ్రాతృత్వానికి ఇబ్బందులు తెచ్చుకోవడమే అవుతుంది. అంతేగాక తక్కువ ఖర్చుతో సత్వర ఫలితాలి చ్చే పెండింగ్ ప్రాజెక్టుల్ని పూర్తి చేయడం అవసరం. కానీ అలా జరగడం లేదు. ఇకపోతే ఃూష్ట్రంలో నీటి వినియోగానికి సంబంధించి కొత్త పాలసీ తీసుకువస్తున్నట్టు కథనాలొచ్చాయి. ప్రస్తుతం విద్యుత్ రంగంలో అమల్లో ఉన్న రెగ్యులేటరీ కమిషన్‌లా నీటి వినియోగానికి కూడా ఒక కమిషన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు కూడా వచ్చింది. గతంలోనే ప్రపంచబ్యాంకు సాగు నీటికి రెగ్యులేటరీ కమిషన్ ఏర్పాటు చేయాలని ఆదేశించడం, అందులో భాగంగా సాగునీటి మీటర్ల ఏర్పాటుకు ఆనాటి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం విఫలయత్నం చేసిన విషయాలు ప్రజల స్మృతి పథం నుండి ఇంకా తొలగిపోలేదు. మళ్లీ అలాంటి ప్రయత్నం చేయడం అన్నదాతలతో సర్కారు కయ్యం తెచ్చుకోవడమే అవుతుంది. నీటి సరఫరాకు చేస్తున్న ఖర్చుకు తగ్గట్టుగా ప్రజల నుండి వసూలు చేసే పన్నులు ఉండేలా చూడటం కూడా పాలసీలో భాగమంటు న్నారు. యూజర్ ఛార్జీలు వసూలు చేయకపోతే భవిష్యత్ నిర్వహణ కష్టం అవుతుందని తొలుత పరిశ్రమల తో ప్రారంభించి, ఆ తరువాత అందరికీ దీనిని విస్తరించే అవకాశం ఉందని సమాచారం. అంతకన్నా ముఖ్యం గా నీటి వినియోగ ప్రాధాన్యతల్లోనూ సర్కారు మార్పులు చేయబోతున్నదని వస్తున్న వార్తలు ఆందోళన కరం. ప్రతి ఎకరాకు సాగునీరందేలా సాగునీటి సంఘాలు కృషి చేయాలని అమరావతిలో నిర్వహించిన నీరు-ప్రగతి, జలహారతి సాగునీటి సంఘాల భాగస్వామ్యం కార్యక్రమంలో సిఎం చంద్రబాబు సూచించడం మంచిదే! అలాగే ఈ ఏడాది నుంచి ఖరీఫ్ సాగును ముందస్తుగా ప్రారంభించాలని తుపానుల వల్ల పంటలు దెబ్బతినకుండా రైతులను సన్నద్ధం చేయాలని, కాల్వలకు మే 15 కల్లా నీటిని విడుదల చేయాలని అధికారులను ఆదేశించడం స్వాగతించదగినది. 'వర్షపు నీటిని భూగర్భ జలాలుగా మార్చుకోవాలని, పరిగెత్తే నీటిని నడిపించాలి, నడిచే నీటిని నిలబెట్టాలి, నిలిచిన నీటిని భూగర్భ జలాలుగా మార్చి భూమినే జలాశయంగా మార్చాలి?' అని చెప్పడం బాగానే వుంది. రాష్ట్రంలో గోదావరి, కృష్ణా, పెన్నా, వంశధార, నాగావళి వంటి 40 నదులు, 38 వేల చెరువులు ఉన్నాయని, వీటన్నిటిలో 1,300 టిఎంసిలకు పైగా నీటిని నిల్వ చేసుకోగలమనీ, ఈ ఏడాది 862 టిఎంసిల నీళ్లు మన జలాశయాల్లో నిల్వ ఉన్నాయని వాస్తవాలు వివరించారు. వరిసాగు తగ్గించి ఎక్కువ మంది రైతులు ఉద్యాన పంటలు, తృణ ధాన్యాల వైపు దృష్టి సారించాలనడం పంటల సరళిని ఏకపక్షంగా మార్చడం మంచిదే అయినా భూములు, నీటి అనుకూలత వంటి విషయలను రైతులతో చర్చిస్తే మంచిది. పంటల సరళిలో మార్పు ఎంతో ప్రణాళికాబద్ధంగా జరగాలే తప్ప హడావుడిగా చేయరాదు. ఆయా పంటల సాగుకు భూసార అనుకూలతలు, నీటిపారుదల సౌకర్యాల లభ్యత లేదా కొరత, పంటల ఉత్పత్తుల వినియోగం, నిల్వ అవకాశాలు, మార్కెట్ పరిస్థితులు వగైరా అనేక అంశాలను శాస్త్రీయంగా అధ్యయనం చేశాకనే నిర్ధారించుకొని, అవసరమైన ప్రోత్సాహకాలిచ్చి అన్నదాత లను అటువైపు మళ్లించవలసి వుంటుంది. కానీ ఆ తరహా ఆలోచనలు, తగిన సన్నాహాలు చేయకుండా ఇటువంటి సలహాలివ్వడం రాష్ట్రానికి శ్రేయస్కరం కాదు. ఇప్పటికే ప్రభుత్వం పంటలకంటే పరిశ్రమలకు, జెన్‌కో అధ్వర్యంలోని జల విద్యుత్ కన్నా కార్పొరేట్లు తెస్తున్న పంప్డ్ హైడ్రో ప్రాజెక్టులకూ మొగ్గు చూపుతున్న వైనం ద్యోతకమవుతోంది. ఈ నేపథ్యంలో కొత్తగా తెచ్చే జల విధానం పై ఎవరికైనా సందేహాలు కలగడం సహజం. ఏదిఏమైనా అంతర్జాతీయ జల సూత్రాల ప్రకారం ప్రజలకు తాగు నీరు, పంటలకు సాగు నీరు, జల విద్యుత్, ఆ తరువాతనే పరిశ్రమలు, ఇతర అవసరాలనే ప్రాధాన్యత క్రమానికి లోబడి ప్రభుత్వం వ్యవహరించడం సబబుగా ఉంటుంది. ఉన్ననీటి వనరులను వాడుకోవడం, అసవరమైన పంటలను పండించడం, రైతులకు లాభాలు చేకూర్చడం అన్నది ఓ ప్రణాళికా బద్దంగా సాగాల్సిన విషయం. ఇందకు ప్రణాళికలు రచించి ముందుకు సాగితే మంచిది. అది వ్యవసాయపరంగా విప్లవాత్మకంగా మారుతుందనడంలో సందేహం లేదు.

## అహోబిలంలో నేడు కోయిల్‌ఆళ్వార్ తిరుమంజనం

నంద్యాల,ఫిబ్రవరి16(ఆర్ఎన్ఎ): ప్రసిద్ధ వైష్ణవ క్షేత్రం అహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని తిరుమంజనం నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఫిబ్రవరి 17వ తేదీన మంగళవారం నాడు దర్శనాలు నిలిపివేయనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు దర్శనాలు ఉండవని భక్తులు గమనించాలని కోరారు. ఫిబ్రవరి 20వ తేదీ నుంచి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం చేస్తున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా ఆలయ గర్భగుడిలో సుగంధ ద్రవ్యాలతో శుద్ధి కార్యక్రమం ఉంటుందని సీఏవో పేర్కొన్నారు.

## వరాహనది ఉత్తరవాహిని తీరంలో భక్తుల సందడి

**ఏర్పాట్లను పర్యవేక్షించిన స్పీకర్ అయ్యన్న పాత్రుడు**



**అనకాపల్లి,ఫిబ్రవరి16 :** మహాశివరాత్రిని పురస్కరించుకొని అనకాపల్లి జిల్లా బలిఘట్టంలో పవిత్ర ఉత్తర వాహిని తీరానికి సోమవారం భక్తులు పోటెత్తారు. ఆదివారం రాత్రి జాగరణ చేసిన భక్తులంతా సోమవారం పుణ్యస్నానాలు ఆచరించేందుకు వరాహనది ఉత్తర వాహిని తీరానికి భారీగా విచ్చేశారు. అనంతరం వారంతా బలిఘట్టం బ్రహ్మ లింగేశ్వర స్వామిని దర్శించుకున్నారు. శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు స్వయంగా ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు సూచనలు ఇచ్చారు. అనంతరం పుణ్యస్నానాలకు విచ్చేసిన భక్తుల సౌకర్యార్థం అన్నవరం సత్యనారాయణ స్వామి దేవస్థానం వద్ద అన్నపూర్ణ అక్షయపాత్ర ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అల్పాహారాన్ని పంపిణీ చేశారు. అయ్యన్నపాత్రుడు, ఆయన సతీమణి, కౌన్సిలర్ చింతకాయల పద్మావతి స్వయంగా పాల్గొని భక్తులకు అల్పాహారాన్ని వడ్డించారు.

# పాలనలో మెరుగైన సేవలే లక్ష్యం

**ఆర్టీజిఎస్ ద్వారా సేవల విస్తృతి ఎక్స్ వేదికగా సిఎం చంద్రబాబు వివరణ**

అమరావతి,ఫిబ్రవరి16 : మానవజీవనాన్ని మెరుగుపరిచేందుకు సేవ చేయాలన్నదే తమ లక్ష్యమని సీఎం చంద్రబాబు అన్నారు. పరిపాలనలో వేగాన్ని, వ్యాపార సౌలభ్యాన్ని ఆర్టీజీఎస్ అందిస్తోందని చెప్పారు. ప్రత్యక్షంగా ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొస్తోందని చెప్పారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. 1990లో బిల్ గేట్స్‌ను కలిసినప్పుడు సాంకేతికత ద్వారా పౌరసాధికారత సాధ్యమనే స్ఫూర్తి వచ్చింది. నాటి ఆలోచనలే ఇవాళ టెక్నాలజీ ఆధారిత పరిపాలనకు బాటలు వేశాయి. ఆర్టీజీఎస్ ద్వారా ఇవాళ పలు కార్యక్రమాల ప్రదర్శన సంతోషంగా ఉందని చంద్రబాబు పేర్కొన్నారు. మరోవైపు ఏపీ ప్రభుత్వంతో భాగస్వామ్యానికి గేట్స్ ఫౌండేషన్ చూపుతున్న నిబద్ధతకు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అభినందనలు తెలిపారు. విద్య, ఆరోగ్యం, వ్యవసాయ రంగాల బలోపేతానికి గేట్స్ ఫౌండేషన్ భాగస్వామ్యం సంతోషంగా ఉందన్నారు. సమగ్ర స్థిర అభివృద్ధి కోసం ఫౌండేషన్ సహకారానికి రాష్ట్ర ప్రభుత్వం ఎదురు చూస్తోందని పవన్ తెలిపారు. సీఎం చంద్రబాబుతో కలిసి బిల్ గేట్స్‌కు ఆత్మీయ స్వాగతం పలకడం ఆనందంగా ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ పర్యటనకు వచ్చిన గేట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపక ఛైర్మన్ బిల్‌గేట్స్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి సచివాలయంలోని రియల్‌టైమ్ గవర్నెన్స్ కమాండ్ సెంటర్‌ను సోమవారం సందర్శించిన సంగతి తెలిసిందే. ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి పాలనలో టెక్నాలజీ వినియోగాన్ని ఆయన పరిశీలించారు. రియల్ టైమ్ గవర్నెన్స్ ద్వారా పౌర సేవల్ని వేగంగా అందిస్తున్న తీరు, ఫలితాలను గేట్స్‌కు ఈ సందర్భంగా చంద్రబాబు వివరించారు.

# హలో ఫ్రెండ్...! హౌ ఆర్ యూ..?'

**చంద్రబాబును పలకరించిన గేట్స్**

అమరావతి,ఫిబ్రవరి16 : గేట్స్ ఫౌండేషన్ ఛైర్మన్ బిల్ గేట్స్‌కు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆత్మీయ స్వాగతం పలికారు. సోమవారం ఏపీ పర్యటనకు వచ్చిన బిల్ గేట్స్.. అమరావతిలోని రాష్ట్ర సచివాలయానికి చేరుకున్నారు. సచివాలయం మొదటి బ్లాక్ వద్ద సీఎం చంద్రబాబు , డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ బిల్ గేట్స్‌ను ఆహ్వానించారు. చంద్రబాబును చూడగానే బిల్ గేట్స్ ఆత్మీయంగా పలకరించారు. 'హలో ఫ్రెండ్...! హౌ ఆర్ యూ..?' అంటూ సీఎం చంద్రబాబును అడిగారు. ఆ తర్వాత ముఖ్యమంత్రి.. తన మంత్రివర్గ సహచరులను, సీఎస్ విజయానంద్‌ను బిల్ గేట్స్‌కు పరిచయం చేశారు. ఆపై రియల్ టైమ్ గవర్నెన్స్ సేవలను బిల్ గేట్స్ పరిశీలించారు. ఆపై బిల్ గేట్స్ సహా గేట్స్ ఫౌండేషన్ ప్రతినిధి బృందంతో ముఖ్యమంత్రి, మంత్రులు, వివిధ శాఖల కార్యదర్శులు సమావేశమయ్యారు. రాష్ట్రంలో గేట్స్ ఫౌండేషన్ సహకారంతో విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టులను మరింత విస్తరించే అంశంపై సమావేశంలో చర్చించినట్లు తెలుస్తోంది. స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్యాలు, ప్రజారోగ్యం, వ్యవసాయం, విద్య తదితర రంగాల్లో చేపట్టిన సంస్కరణలపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజెంటేషన్ ఇచ్చారు. మెడ్ టెక్, డయాగ్నస్టిక్స్ సేవలు, సాంకేతిక సాగు సహా తదితర ప్రాజెక్టుల గురించి వివరించనున్నారు సీఎం, అధికారులు. ప్రత్యేకించి గేట్స్ ఫౌండేషన్ సహకారంతో నడుస్తున్న సంజీవని ప్రాజెక్టు గురించి సర్కార్ వివరించనుంది. సమావేశానికి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రులు నారా లోకేశ్, పయ్యావుల కేశవ్, అచ్చెన్నాయుడు, గొట్టిపాటి రవికుమార్, డోలా బాల వీరాంజనేయ స్వామి, సవిత, అనిత, కొల్లు రవీంద్ర, కందుల దుర్గేశ్, కొలుసు పార్థసారథి, నిమ్మల రామానాయుడు, అనగాని సత్యప్రసాద్, బీసీ జనార్దన్ రెడ్డి, సత్య కుమార్ యాదవ్, గుమ్మడి సంధ్యారాణి, పొంగూరు నారాయణ హాజరయ్యారు. అలాగే, వివిధ శాఖల విభాగాధిపతులు వర్చువల్‌గా సమావేశానికి హాజరయ్యారు.

--------



# ప్రత్యేక విమానంలో గన్నవరం చేరుకున్న గేట్స్

## మంత్రులు, అధికారుల ఘన స్వాగతం



అమరావతి,ఫిబ్రవరి16 : గేట్స్ ఫౌండేషన్ ఛైర్మన్ బిల్ గేట్స్‌తోపాటు ఆయన ప్రతినిధి బృందం సోమవారం ఉదయం ప్రత్యేక విమానంలో గన్నవరం ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా వారికి ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌తోపాటు పలువురు మంత్రులు, ఉన్నతాధికారులు ఘనస్వాగతం పలికారు. అంతకు ముందు పొగ మంచు కారణంగా దాదాపు 15 నిమిషాలపాటు.. బిల్స్ గేట్స్ ప్రతినిధుల బృందం ప్రయాణిస్తున్న విమానం గాల్లోనే చక్కర్లు కొట్టింది. ఏటీసీ అనుమతి ఇవ్వడంతో గన్నవరం ఎయిర్ పోర్టులో విమానం ల్యాండ్ అయింది. ఇక బిల్ గేట్స్ ప్రతినిధి బృందంతోపాటు స్వాగతం పలికిన మంత్రులు, అధికారుల బృందం వెలగపూడిలోని సచివాలయానికి ఎయిర్ పోర్టు నుంచి బయలుదేరారు. సచివాలయం వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబు వీరికి స్వాగతం పలకనున్నారు. అనంతరం బిల్ గేట్స్ ప్రతినిధి బృందంతో వారంతా సమావేశం కానున్నారు. గేట్స్ ఫౌండేషన్ సహకారంతో విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో రాష్ట్రప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టులు విస్తరించే అంశంపై వీరంతా చర్చించనున్నారు. ఆ తర్వాత ఆర్టీజీఎస్ కేంద్రానికి చేరుకుని.. పాలనలో టెక్నాలజీ వినియోగాన్ని బిల్ గేట్స్ ప్రతినిధి బృందం పరిశీలించనుంది. రియల్ టైమ్ గవర్నెన్స్ విధి విధానాలు, ఫలితాలను ఈ సందర్భంగా బిల్ గేట్స్‌కు సీఎం చంద్రబాబు సోదాహరణగా వివరించనున్నారు. అలాగే గేట్స్ బృందంతో సీఎం, మంత్రులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు సమావేశం కానున్నారు. ఇందులో స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్యాలు, ప్రజారోగ్యం, వ్యవసాయం, విద్య తదితర రంగాల్లో చేపట్టిన సంస్కరణలపై సీఎం ప్రజంటేషన్ ఇవ్వనున్నారు. ఏపీ ప్రభుత్వం అమలు చేస్తున్న మెడ్ టెక్, డయాగ్నస్టిక్స్ సేవలు, సంజీవని తదితర ప్రాజెక్టులను బిల్ గేట్స్‌కు సీఎం చంద్రబాబు వివరిస్తారు. బిల్ గేట్స్‌కు చెందిన గేట్స్ ఫౌండేషన్ సహకారంతో సంజీవని ప్రాజెక్ట్ నడుస్తున్న సంగతి తెలిసిందే. ఉండవల్లి సమీపంలోని వ్యవసాయ క్షేత్రంలో బిల్ గేట్స్ బృందం పర్యటించనుంది. అక్కడ డ్రోన్లు, ఏఐ టెక్నాలజీ సహకారంతో చేపట్టే సాగు విధానాన్ని ఈ బృందం పరిశీలించనుంది. ఈ బృందం వెంట సీఎం చంద్రబాబుతోపాటు మంత్రులు, అధికారులు ఉండనున్నారు.

--------------

## ద్వారకమయి హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / ఫిబ్రవరి 16 ,(చట్టం బ్యూరో) :** బోయిన్ పల్లి మండలంలోని విలాసాగర్ గ్రామంలో కరీంనగర్ కు చెందిన ద్వారక మయి ఆస్పత్రి యాజమాన్యం ఆధ్వర్యంలో విలాసాగర్ లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజలు హాజరై వివిధ పరీక్షలు నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన గ్రామ సర్పంచ్ ఏనుగుల కనకయ్యను హాస్పిటల్ యజమాన్యం సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి యజమాన్యంతో పాటు గ్రామ ఉపసర్పంచ్ వార్డు సభ్యులు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## హరిత సేనలో మొక్కలు నాటిన.. బుర్ర సోము శోభా , ఏనుగుల లక్ష్మణ్ వాణి



; **ఉమ్మడి కరీంనగర్ జిల్లా / ఫిబ్రవరి 16 ,(చట్టం బ్యూరో) :** గ్రీన్ ఇండియా ఛాలెంజ్ సోమవారం తమ పెళ్లిరోజు సందర్భంగా గ్రీన్ ఇండియా ఛాలెంజ్ హరిత సేనలో పాల్గొని మొక్కలు నాటిన బుర్ర సోము శోభా , ఏనుగుల లక్ష్మణ్ వాణి . మాజీ రాజ్యసభ సభ్యులు జోగినిపల్లి సంతోష్ కుమార్ ప్రారంభించిన గ్రీన్ ఇండియా ఛాలెంజ్ హరిత సేనలో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినీపల్లి మండలం తడగొండ గ్రామంలో తమ పెళ్లిరోజు పురస్కరించుకొని మున్నూరు కాపు సంఘం ఆవరణలో వారి కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ ప్రేమికుడు జోగినిపల్లి సంతోష్ కుమార్ ఎంతో ప్రతిష్ఠమంగా చేపట్టిన గ్రీన్ ఇండియా ఛాలెంజ్ లో పాల్గొని మొక్కలు నాటడం సంతోషంగా ఉందని తెలిపారు. ఇలానే ప్రతి ఒక్కరు మొక్కలు నాటి భావితరాలకు బహుమతిగా అందించాలని కోరారు. ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్న మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు సింగరి రమేష్, వార్డ్ సభ్యులు బుర్ర రాజు, ఐలాపురం వెంకటరమణ,చిందం తిరుపతి,చేపూరి మహిపాల్, బొడ్డు రమేష్, కట్ట లింగయ్య, ముదం కమలాకర్, బుర్ర కనకయ్య, కమల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## భవిష్యత్‌లో తెలంగాణలో అధికారం బి ఆర్ ఎస్ పార్టీ దే



**చొప్పదండి నియోజకవర్గం బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు న్యాయవాది కట్టెకోల లక్ష్మణ్ ; ఉమ్మడి కరీంనగర్ జిల్లా / ఫిబ్రవరి 16 , (చట్టం బ్యూరో )** ; తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలలో ఉత్తమమైన ఫలితాలు బి ఆర్ ఎస్ పార్టీ సాధించింది అని చొప్పదండి నియోజకవర్గం బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు న్యాయవాది కట్టెకోల లక్ష్మణ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గణనీయమైన స్థానాలు మున్సిపల్ ఎన్నికలలో సాధించి ముందుకు దూసుకుపోతుందనీ భవిష్యత్తులో బి ఆర్ ఎస్ పార్టీకి ప్రజలు పట్టం కడతారని తెలిపారు. కెసిఆర్ తోనే తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. ఆయన వెంట చొప్పదండి నియోజకవర్గం నాయకులు పాల్గొన్నారు.

## కరీంనగర్ మేయర్ పీఠము కైవసం చేసుకున్న బిజెపి

**కరీంనగర్ మేయర్ గా కోలగాని శ్రీనివాస్ , డిప్యూటీ మేయర్ గా యాదగిరి సునీల్ రావు ;**





**ఉమ్మడి కరీంనగర్ జిల్లా/ ఫిబ్రవరి 16 ,(చట్టం బ్యూరో) :** కరీంనగర్ కార్పొరేషన్ మేయర్ పీఠాన్ని ఉత్కంఠ భరితంగా జరిగిన ఎన్నికలో బిజెపి పార్టీ దక్కించుకుంది. చివరి వరకు అనేక ట్విస్టు లతో సాగింది. బి ఆర్ ఎస్ పార్టీ తటస్థంగా ఉండడంతో ఎన్నిక లాంఛన ప్రాయంగా బిజెపికి అనుకూలంగా మారింది. కరీంనగర్ కార్పొరేషన్ మేయర్ గా బిజెపి కార్యకర్త కోలగాని శ్రీనివాస్ , డిప్యూటీ మేయర్ గా యాదగిరి సునీల్ రావు లను కార్పోరేటర్లు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కరీంనగర్ ఎంపీ కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ కార్పొరేషన్ లో పూర్తి మెజార్టీ వచ్చిన కూడా కుట్రలతో బిజెపిని అధికారంలోకి రాకుండా అనేక ప్రయత్నాలు కాంగ్రెస్ ఎంఐఎం స్వాతంత్రులతో కలిసి చేశాయని కానీ ఎక్కడ కూడా వారి పాచికలు పారలేదని పేర్కొన్నారు. భవిష్యత్తులో తెలంగాణలో బిజెపి అధికారంలోకి వస్తుందని ఎన్ని కుట్రలు పన్నిన బిజెపి దే విజయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, నగరపాలక సంస్థ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

# స్వరాష్ట్ర కలను సాకారం చేసిన వ్యక్తి కేసీఆర్ -- మాజీ ఎంపీ నామ

- సంక్షేమ పాలన కు ప్రతీక కేసీఆర్ - మాజీ ఎంపీ నామ
- అభివృద్ధి సంక్షేమానికి చిరునామా కేసీఆర్ నాయకత్వం - మాజీ ఎంపీ నామ
- జననేత కేసీఆర్ కు జన్మదిన శుభాకాంక్షలు - మాజీ ఎంపీ నామ



**ఖమ్మం బ్యూరో (చట్టం న్యూస్) పిబ్రవరి 16 :** తెలంగాణ స్వరాష్ట్ర కలను నిజం చేసి, సాధించుకున్న తెలంగాణను యావత్ దేశానికి అభివృద్ధిలో ఆదర్శంగా నిలిపిన గొప్ప నాయకుడు, రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్ రావు అని పేర్కొన్నారు. మంగళవారం కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ బిఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధనకు కృషి చేయడమే కాకుండా, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగించిన మహానేత కేసీఆర్ అని కొనియాడారు. రైతుల సంక్షేమానికి రైతుబంధు, రైతుబీమా పథకాలతో ఆర్థిక భరోసా కల్పించారని, సాగునీటి ప్రాజెక్టుల ద్వారా వ్యవసాయ రంగానికి కొత్త ఊపునిచ్చారని పేర్కొన్నారు. పేదల కోసం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పథకం, కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి పథకాలతో ఆడబిడ్డల భవిష్యత్తుకు భరోసా ఇచ్చారని అన్నారు. ఆరోగ్య రంగంలో కేసీఆర్ కిట్, ఆరోగ్యశ్రీ పథకాల ద్వారా పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించారని తెలిపారు. విద్యారంగంలో గురుకులాలు, రెసిడెన్షియల్ స్కూళ్ల విస్తరణ ద్వారా పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించారని, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో ప్రత్యేక శ్రద్ధ చూపారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇరవై నాలుగు గంటల విద్యుత్, మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించి, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచారని కొనియాడారు. అలాగే, పరిశ్రమల స్థాపన, పెట్టుబడుల ఆకర్షణ, మౌలిక సదుపాయాల అభివృద్ధిలో తెలంగాణను దేశంలో అగ్రగామిగా నిలిపారని అన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలోనూ కేసీఆర్ ప్రభుత్వం ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. కేసఆర్ పదేళ్ల పాలనలో తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి ఎనలేని సేవలు అందించిన కేసీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయన ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో జీవించాలని నామ నాగేశ్వరరావు ఆకాంక్షించారు. భవిష్యత్తులోనూ ప్రజల సంక్షేమం కోసం భారత రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం మరింత ప్రగతి సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# తొర్రూరు మున్సిపాలిటీలో రాజకీయ రగడలు...





- ఎంపీ ఓటు చెల్లదంటూ అభ్యంతరాలు -- వార్డు సభ్యత్వంపై పరస్పర ఫిర్యాదులు...
- మున్సిపాలిటీ వద్ద ఉద్రిక్త వాతావరణం...
- చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు రేపటికి వాయిదా.

**మహబూబాబాద్ జిల్లా తొర్రూరు, ఫిబ్రవరి 16 (చట్టం న్యూస్) :**
మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల ప్రక్రియ తీవ్ర వివాదాల నడుమ నిలిచిపోయింది. రాజకీయ పార్టీలు పరస్పరం ఆరోపణలు చేసుకోవడంతో ఎన్నికలను తాత్కాలికంగా వాయిదా వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. అధికార యంత్రాంగం జోక్యంతో సమావేశాన్ని నిలిపివేసి తదుపరి నిర్ణయాన్ని ప్రకటించనుంది. ఈ ఎన్నికల ప్రక్రియలో కీలక మలుపు తిరిగింది. కడియం కావ్య ఓటు వేసిన చెల్లదని భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) నాయకులు అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఎంపీగా ఉన్న వ్యక్తికి మున్సిపల్ ఎన్నికలలో ఓటు హక్కు ఉండదని వారు వాదిస్తూ, ఎన్నికల ప్రక్రియను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఇదే సమయంలో మరో వివాదం తెరపైకి వచ్చింది. నాలుగో వార్డు సభ్యుడిగా ఉన్న పేర్ల జంపన్న సభ్యత్వంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ నాయకులు ప్రతివాద ఫిర్యాదు సమర్పించారు. సభ్యత్వ అర్హతలు, ఎన్నికల చట్టబద్ధతపై పునఃపరిశీలన చేయాలని వారు కోరారు.

**పరస్పర ఆరోపణలతో సమావేశం ఉద్రిక్తం...**

మున్సిపల్ కార్యాలయంలో జరిగిన సమావేశం ప్రారంభమైన కొద్దిసేపటికే రెండు పార్టీల నాయకులు న్యాయపరమైన అంశాలను లేవనెత్తడంతో వాగ్వాదం నెలకొంది. చట్టబద్ధతను పాటించకుండా ఎన్నికలు జరపాలని ప్రయత్నిస్తున్నారు అంటూ బీఆర్ఎస్ నాయకులు ఆరోపించగా,ఓటమి భయంతోనే అనవసర అభ్యంతరాలు పెడుతున్నారు అంటూ కాంగ్రెస్ నాయకులు ప్రతిస్పందించారు. ఈ పరిణామాలతో సమావేశ మందిరంలో ఉద్రిక్త వాతావరణం నెలకొనగా, అధికారులు పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. పోలీసులు కూడా అప్రమత్తంగా మోహరించారు.

**అధికారుల జోక్యం -- ఎన్నికల వాయిదా నిర్ణయం...**

వివాదాస్పద అంశాలపై స్పష్టత వచ్చే వరకు ఎన్నికలు నిర్వహించడం సాధ్యం కాదని భావించిన ఎన్నికల అధికారి సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఫిర్యాదులపై చట్టపరమైన అభిప్రాయం తీసుకుని, అర్హతలపై నివేదిక సిద్ధం చేసిన తర్వాతే కొత్త తేదీ ప్రకటిస్తామని తెలిపారు. ఈ పరిణామం తొర్రూరు పట్టణంలో రాజకీయ చర్చలకు దారి తీసింది. మున్సిపాలిటీ ఏర్పాటయ్యాక ఇదే మొదటిసారి చైర్మన్ ఎన్నికల ప్రక్రియ ఇంత తీవ్ర వివాదానికి దారి తీసిందని స్థానికులు పేర్కొంటున్నారు. పార్టీల మధ్య పెరిగిన రాజకీయ పోటీ కారణంగానే ఈ పరిస్థితి ఏర్పడిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# వెల్నెస్ సెంటర్ సమస్యలు పరిష్కరించండి

**రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా కలెక్టర్కు వినతి.**

**ఖమ్మం బ్యూరో (చట్టం న్యూస్) పిబ్రవరి 16 :** ఉద్యోగ పెన్షనర్ల ఆరోగ్య సంరక్షణ కోసం ఖమ్మం లోని ప్రభుత్వ ఆసుపత్రి లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వెల్నెస్ సెంటర్ లో అనేక సమస్యలు అపరిస్కృతంగా ఉన్నాయని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా శాఖ ప్రతినిధి బృందం ఈరోజు వెళ్లే సెంటర్ ను సందర్శించి అపరిస్కృతంగా ఉన్న సమస్యలను ఆసుపత్రి సూపర్డెంట్ కు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఇచ్చారు. ముఖ్యంగా ఆసుపత్రిలో డాక్టర్ ప్రతిరోజు రెండు గంటలు మాత్రమే ఉండి తను ప్రైవేటు వైద్య కోసం వెళుతున్నారని దానివలన సెంటర్లో అనుభవం ఉన్న డాక్టర్ అందుబాటులో లేకపోవడం వలన పెన్షనర్లు ఇబ్బంది పడుతున్నారని ఉమ్మడి జిల్లాలో ఖమ్మంలో మాత్రమే ఉండటం వలన దూర ప్రాంతం నుండి వచ్చిన వారు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అవసరమైన అన్ని మందులు కూడా అందుబాటులో ఉండటం లేదని అన్ని రకాల పరీక్షలు ప్రతిరోజు నిర్వహించడం లేదని ఆసుపత్రి ఆవరణ కూడా రిటైర్డ్ ఉద్యోగులు వేచి ఉండటం కోసం తగిన వసతి కూడా లేదని ఈ విషయంలో జిల్లా కలెక్టర్ పరిశీలించి వెల్నెస్ సెంటర్ను అందరికీ అందుబాటులోకి తీసుకువచ్చే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా శాఖ ప్రతినిధి బృందం కలెక్టర్కు విజ్ఞప్తి చేసింది. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లూరి వేణు ఆర్థిక కార్యదర్శి వెంకట్ నారాయణ ఉపాధ్యక్షులు ఎస్ పూర్ణచంద్రావు జిల్లా నాయకులు ఖాజా మొయినుద్దీన్ పి జానయ్య ఖమ్మం నగర శాఖ నాయకులు రాధాకృష్ణ డి రమేష్ సత్యనారాయణ పని రాజ్ కుమార్ శంకర్ రమణ యాదవ్ డీకే శర్మ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.






# కేసముద్రం మున్సిపాలిటీ కాంగ్రెస్ కైవసం.

- బలరాం నాయక్ ఓటు బలంతో కాంగ్రెస్ జెండా బలపడింది.
- మున్సిపల్ కౌన్సిలర్ చైర్ పర్సన్ ల ప్రమాణ స్వీకారం
- బానోతు సునీత చైర్పర్సన్ గా అల్లం రమ వైస్ చైర్మన్ గా నిలిచారు.





**మహబూబాబాద్ జిల్లా కేసముద్రం చట్టం న్యూస్ :** కేసముద్రం మున్సిపాలిటీ ఎన్నికల్లో 16 వార్డులకు గాను అధికార కాంగ్రెస్ పార్టీ ఎనిమిది వార్డులు గెలుపొందగా ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ ఎనిమిది స్థానాలు సమన్యాయం ఉండడంతో చైర్మన్ పీఠం అధిరోహించడం కై ఉత్కంఠ గా నెలకొన్న నేపథ్యంలో, స్థానిక ఎంపీ పోరిక బలరాం నాయక్ కేసముద్రంలో ఎక్స్ అఫీషియో సభ్యుడిగా తమ ఓటును వినియోగించుకోవడంతో చైర్ పర్సన్ కు మ్యాజిక్ ఫిగర్ కాంగ్రెస్ పార్టీకి దక్కడంతో కాంగ్రెస్ పార్టీ నుండి రెండవ వార్డు కౌన్సిలర్ గా గెలుపొందిన బానోత్ సునీత నూతన మున్సిపాలిటీకి చైర్పర్సన్ గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇదిలా ఉండగా వైస్ చైర్మన్ గా అధికార పార్టీకి మెజార్టీ ఉండడంతో 13వ వార్డు కౌన్సిలర్ గా గెలుపొందిన డాక్టర్ అల్లం రమ వైస్ చైర్ పర్సన్ గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన మున్సిపాలిటీలో తమపై నమ్మకంతో ఎన్నుకున్నందుకు ప్రజాపాలనే ధ్యేయంగా మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలందరికీ అండగా ఉంటామని కాంగ్రెస్ ప్రభుత్వంలో కేసముద్రం పట్టణాన్ని మరింత అభివృద్ధి బాటలో నడిపిస్తామన్నారు. స్థానిక ఎంపీ పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్, ఎం సలహాదారులు వేం నరేందర్ రెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు.

# రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ తెలంగాణ ఉద్యమకారుడు బత్తుల సోమయ్య



**ఖమ్మం, బ్యూరో చట్టం (ప్రకారం) ఫిబ్రవరి 16:** తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమకారుడు బత్తుల సోమయ్య సోమవారం ఉదయం కూసుమంచి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. కూసుమంచిలోని గణపేశ్వర ఆలయంలో దర్శనం కోసం కుటుంబసమేతంగా తన కారులో వెళ్తుండగా.. ఉదయం 7 గంటల సమయంలో ఒక్క సారిగా ద్విచక్ర వాహనం ఎదురుగా వచ్చింది. దాన్ని తప్పించే క్రమంలో కారు చెట్టును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బత్తుల సోమయ్య తీవ్రమైన గాయాలు అయ్యాయి. తన భార్య కు చేయి విరిగింది. బత్తుల సోమయ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ద్విచక్ర వాహనం పై వెళ్తున్న వారికి స్వల్ప గాయాలు అయ్యాయని స్థానికులు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# విశాఖ బీచ్‌లో విషాదం

## అలల ధాటికి కొట్టుకు పోయి విద్యార్థి మృతి

విశాఖపట్టణం,ఫిబ్రవరి16(ఆర్ఎన్ఎ): విశాఖ సాగర తీరంలో ఆదివారం విషాదం నెలకొంది. బీచ్‌లో సరదాగా స్నానానికి దిగిన యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొమ్మదిలోని గాయత్రి విద్యా పరిషత్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్న ఆరుగురు విద్యార్థులు ఆదివారం రుషికొండ బీచ్‌కు వెళ్లారు. రేడిసన్ బ్లూ రిసార్ట్ వెనుక ఉన్న సముద్రతీరంలో ఐదుగురు స్నానానికి దిగారు. వీరిలో పి.అరవింద్ కృష్ణ (21) అలల తాకిడికి ఒక్కసారిగా కొట్టుకుపోయాడు. గమనించిన అతని స్నేహితుడు రాజీవ్.. అరవింద్‌కృష్ణను కాపాడే ప్రయత్నంలో అతను కూడా నీటిలో మునిగిపోయాడు. స్పందించిన బ్లూ బీచ్ లైఫ్ గార్డ్ సిబ్బందితోపాటు బోటింగ్ యాజమాన్యం ఇద్దరినీ రక్షించి ఒడ్డుకు చేర్చారు. అపస్మారక స్థితిలో ఉన్న అరవింద్‌కృష్ణను అంబులెన్స్‌లో స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అరవింద్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి స్వస్థలం రాజమండ్రి. రాజీవ్ అనే విద్యార్థి క్షేమంగా బయటపడటంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. అరిలోవ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# పోకబత్తిని అనితని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేసిన కొప్పుల అశోక్





**ఖమ్మం బ్యూరో (చట్టం న్యూస్) పిబ్రవరి 16 :** ఏదులాపురం నూతన మున్సిపల్ చైర్ పర్సన్ గా ఎన్నికైన పోకబత్తిని అనిత ని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేసిన తిరుమలయపాలెం మండల మాజీ ఎంపిపి కొప్పుల అశోక్ అనంతరం 11 డివిజన్ కార్పొరేటర్ పేరం వెంకటలక్ష్మి విజయం కోసం శ్రమించిన కొప్పుల అశోక్ ని విరవెల్లి అప్పారావు. చల్ల కృష్ణ ని సన్మానించారు

# అన్యాయపు ప్రాతినిధ్యం



**కొడిమ్యాల, ఫిబ్రవరి 16(చట్టం) :** సమాన పనికి సమాన వేతనం మా హక్కు అంటూ సమగ్ర శిక్ష ఉద్యోగులు సోషల్ మీడియాలో సదరు నాయకులను నిలదీస్తున్నారు. గత 15-20 సంవత్సరాలుగా కుటుంబ పోషణకు సరిపోని గౌరవ వేతనాలతో కనీసం గౌరవప్రదంగా బ్రతకడానికి కావలసిన జీతం పొందలేని స్థితిలో ఉండి ఏ రోజుకైనా మాకు న్యాయం జరుగుతుంది అన్న ఆశతో బ్రతుకు బండి సాగదీస్తున్నామని అన్నారు. సమ్మె సమయంలో సమగ్ర శిక్ష ఉద్యోగులకు నాయకులు ఇచ్చిన మాట ప్రకారం అధికారులను సమాన పనికి సమాన వేతనం అడగాల్సింది పోయి కనీసం మా అభిప్రాయం కూడా సేకరించకుండా కేవలం 30 శాతం మాత్రమే పెంచమని ప్రాతినిధ్యం చేయడం సమగ్ర శిక్ష ఉద్యోగులను ముమ్మాటికి అవమానించడమే అని, ఈ ప్రాతినిధ్యాన్ని ఖండిస్తున్నామని సోషల్ మీడియా వేదికగా తేల్చి చెప్తున్నారు.

# మరిపెడ మున్సిపాలిటీలో నూతన నాయకత్వం

**చైర్ పర్సన్ గా వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి**




**మహబూబాబాద్ జిల్లా మరిపెడ ఫిబ్రవరి 16 చట్టం న్యూస్ :**
మహబూబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపల్ కేంద్రంలో నూతన ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా జరిగింది నూతన మున్సిపల్ చైర్ పర్సన్ గా వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రా నాయక్ ముఖ్య అతిథిగా హాజరై నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్ పర్సన్ వైస్ చైర్ పర్సన్ లను అధికారకంగా ప్రకటించారు చైర్ పర్సన్ వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలు ఇచ్చిన గెలుపు బాధ్యతగా భావించి పట్టణ అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు వైస్ చైర్ పర్సన్ కాలం సునీత రవీందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి కౌన్సిలర్ తో కలిసి సమన్వయంతో పని చేస్తూ మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్న కౌన్సిలర్లు రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి కార్యక్రమాలకు సహకరిస్తామని వెల్లడించారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ఒంటికొమ్ము యుగంధర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా యువ నాయకులు నూకల అభినవరెడ్డి కేసముద్రం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పెద్ద బోయిన ఐలమాలలో పట్టణ అధ్యక్షులు షేక్ తాజోద్దీన్ రామ్లాల్ మాజీ ఎంపీటీసీ గంధసిరి అంబరీష షేక్ అఫ్జల్ కాలం రవీందర్ రెడ్డి గంధసిరి బిక్షపతి అల్వాల ఉపేందర్ ప్రజాపతి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# మిత్రుడి, క్లాసుమేట్ తల్లీ అంతిమయాత్రలో పాడే మోసిన చిలువేరు సమ్మయ్య గౌడ్.




**మహబూబాబాద్ జిల్లా కేసముద్రం చట్టం న్యూస్ :** మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం ఇంటికన్నె గ్రామానికి చెందిన ఏ ఎం సీ కేసముద్రం లో కంప్యూటర్ ఆపరేటర్ గా పనిచేస్తున్న అంబాల భాస్కర్, ఆర్.ఎం.పి.మురళీ,చిన్ననాటి మిత్రుడు, క్లాసుమేట్ పీ.సి అంబాల కిరణ్ గౌడ్ తల్లీ అంబాల యాక లక్ష్మి మరణించగా చిన్ననాటి మిత్రులు, క్లాసుమేట్ సమ్మిగౌడ్ చిలువేరు, చాగంటి రాములు, కట్టన్న, పులిగిల్ల కిరణ్ వారి ఇంటికి వెళ్లి వారి పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అంతిమయాత్రలో పాల్గొని పాడే మోసారు చిలువేరు సమ్మయ్య గౌడ్ అనంతరం వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపి వారికి మనోధైర్యాన్ని కల్పించారు.
ఈ కార్యక్రమంలో వారి వెంట జగన్ గౌడ్, కన్నయ్య మునికుంట్ల, కోతి వెంకటేశ్వర్లు, కన్న యాకయ్య, మునికుంట్ల ఐలేష్ తదితరులు పాల్గొన్నారు.



చట్టం సాహితీ లోకం 95814 19999

## సృష్టి ఆదిదంపతులు పార్వతీ పరమేశ్వరుల లోక కల్యాణం!



వాగర్ధ సంపృక్తౌ వాగర్ధ ప్రతిపత్తయే!
జగతం పితరౌ వందే పార్వతీ పరమేశ్వరౌ!

వాక్కు,అర్థము ఒకదాన్నొకటి వదలక ఉన్నట్లే, పార్వతీపర మేశ్వరులు ఒకరినొకరు వదలక జగన్మాతా త్రితలై, ఆది దంపతులై, ఉన్న వారికి భక్తి పూర్వక వందనములు!

మహాశివరాత్రి పర్వదినాన ఈ సృష్టిఆదిదంపతులుశివపార్వతుల కళ్యాణం లోకోపకార ది వ్య భవ్య కళ్యాణమై జరుగు! ఈకళ్యాణమునక చతుర్ముఖ బ్రహ్మ పురోహితుడై, సాక్షాత్ విష్ణువు హైమవతికి సోదరు డై, కాలాతీతుడైన మహాదేవు డు శంకరునికి ఇచ్చి పాణిగ్ర హణం (పరిణయం)చేయుట!

పంచభూతములు,ప్రకృతులు ప్రమధ గణములు,ముక్కోటి దేవతలు, అష్టదిక్పాలకులు నవగ్రహాలు, సప్త ఋషులు దేవి దేవతా మూర్తులు అంతా కూడా అతిథులు! ఈ ఘన శివపార్వతి లోకకళ్యాణానికి!

దివ్య దివ్యమైన ప్రేమ గొప్ప శక్తి ల కలయిక తారకాసుర సంహారం! లోక రక్షణ కోసం! శివుడు మరియు పార్వతుల కళ్యాణం! శివ కళ్యాణం!

దక్ష యజ్ఞం! శివునికి ఆహ్వాన తిరస్కరణ! కుమార్తె సతిదేవి కి పరాభవం!ఆమె శరీరంఅగ్ని కి ఆహుతి!శివుడుగొప్పధ్యాన తపస్సు! సతీదేవి మరల పార్వతి దేవి గా జన్మించుట!

శివునికైఅపర్ణగాఘోరతపస్సు మన్మథవధ!, పార్వతి శివుని మనసు గెలుపు!దేవీ దేవతల వేడుకోలు!ఊరడింపుసమ్మతి

విష్ణువు మరియు దేవి దేవత ల సమక్షంలోభూదేవంత పీట ఆకాశమంత పందిరి లో,అంగ రంగ వైభవంగా పెండ్లి! అదే శివ పార్వతి శుభ లోక హిత కళ్యాణం! చూతము రారండి!
ఇహలోకసుఖంపరలోకమోక్షం
సర్వజీవులకుఅభయంమోక్షం
ఓం శ్రీ అర్ధనారీశ్వరాయ నమః శివ పార్వతియే నమః ఓం శ్రీ అర్ధనారీశ్వరాయ శివ పార్వతియే నమః

డాక్టర్ ప్రాత రాజశేఖర్, ప్రభుత్వ విశ్రాంత గురుకుల ఉపాధ్యాయులు, చోడవరం.

చట్టం సాహితీ లోకం 95814 19999

## చీకటిని చీల్చే వెలుగు కొరకు

ఎండుటాకుల
పూరిగుడిసెల మీద,
ఆకాశాన్నంటే అద్దాల మేడల మీద,
అంటరాని పిచ్చి మొక్కల పువ్వులమీద,
మందార,సుగంధాల,
మల్లెలమీద,
మనస్సులేని ముళ్ళకంచెల
వికృత నవ్వుల మీద,
అనాథల సమాధుల మీద అందాల్ని ఆరేసుకున్న పూదోటలమీద,
ఉదయాన్నే ఉధృతంగా ప్రవహించే
మూసి మురుగుమీద,
దేశంలోని దౌర్భాగ్యాల్ని ముందేసుకుని తన్నుకునే ఊరి అరుగుమీద,

అందరూ చూస్తుండగానే జరిగిన అత్యాచారాల మీద,
నెత్తుటి మరకలంటని రాజకీయ హంతకుల మీద,

బంజారాహిల్స్ రోడ్డుమీద రాత్రి పగిలిన కాస్ట్లీ మందు సీసా ముక్కల మీద,
ఉస్మానియా మార్చురిలో గుర్తుతెలియని శవం చెప్పే సాక్ష్యాలమీద,

తళతళ మెరిసే కార్మికుని చెమటచుక్కల ముత్యాల మీద,
పూటపూటకు దహించే పేదోడి కడుపుల్లో ఆకలిమంటల మీద,

అధికార,ఆదిపత్యపు,
అబద్ధాలతో దద్దరిల్లే
అసెంబ్లీ మీద,
రాజ్యాంగాన్ని నిత్యం కాల"రాస్తున్న నూతన పార్లమెంటు మీద,

ఎవ్వరి కంటికి చిక్కకుండా,చీకటిని పులుముకుని
పవిత్రతను కప్పుకొని
రహస్య ఒప్పందాల్ని చేసుకుంటున్న నకిలీలోకం సాగిస్తున్న అరాచకాల్ని వెలుగెత్తి చూపడానికి,
తేటతెల్లం చేయడానికి తొందరగరా...


రాత్రి జరిగిన అగాయిత్యాల్ని మోసుకొచ్చే వార్తా పత్రికల కంటే ముందే,
=జ బస్సుకు ప్రజలు
అయస్కాంతంలా చుట్టూ అతుక్కోక ముందే,
ట్రాఫిక్ చలాన్లను పోలీసులింకా జులిపించక ముందే,
రా... వచ్చి,
నిన్నటి గతాన్ని మైమరచి అస్తవ్యస్తంగా మొరుగుతున్న గురకల నుండి విముక్తిని కలిగించు,
నిద్ర శిధిలాల్ని తొలగించు,
మా ఎముకల్లో గడ్డకట్టిన మబ్బు తెరల్ని ఈ ఉదయపు ఎండలో ఎండగట్టు సూర్యదేవ.

వెంకటేష్ విశ్వ
సెల్:9553762108



చట్టం సాహితీ లోకం 95814 19999

## న్యాయం వైపు కదులుతూ...



ఓ మనిషి.. ఓ మనిషి
ఏది నీ నడత
ఎటు పోతున్నావు
ఎటువైపు నీ ప్రయాణం. ప్రయాణం

ఏది ధర్మం ఏది అధర్మం
ఏది న్యాయం ఏది అన్యాయం
ధర్మా ధర్మాలు న్యాయాన్యాయాలు
మరిచి ఎటు
పయనిస్తున్నావు..పయనిస్తున్నావు..

నాలుగు పాదాల మీద నడవాల్సిన ధర్మం
ఒంటి కాలుతో కుంటుతూ ...ఒంటి కాలుతో కుంటుతూ
అన్యాయం న్యాయాలుగా మారి
న్యాయం నవ్వుల పాలవుతూ..నవ్వుల పాలవుతూ..

ధర్మం వైపు అడుగులు వేస్తూ
అధర్మం పై పోరాడూ.. అధర్మం పై పోరాడూ..
న్యాయం వైపు కదులుతూ
అన్యాయాన్ని అణకదొక్కు.అన్యాయాన్ని అణకదొక్కు.

రచన:- వేనాప
జి.ప.ఉ.పా.గుడిబండ
కోదాడ 98484 32533

చట్టం సాహితీ లోకం 95814 19999

## మందు ఒక్కటే మానవత్వం..!



మాయమైపోతున్నాడమ్మా
మనిషన్నవాడు
మచ్చుకైనా లేడు చూడు
మానవత్వమున్నవాడు అంటూ
వాపోయాడు ఆశుకవి అందెశ్రీ గారు...

ఔను అరిషడ్వర్గాలనే
అంతర్గత దుర్గుణాలతో
మనిషి మలినమైపోతున్నాడు అవి
అంతరంగంలోఎగిసే ఆరని అగ్నికణాలు...

నేడు ఎటువైపు చూసినా
స్వార్థం కులం బలం అహంకారం
ఆశ్రిత పక్షపాతాలే రాజ్యమేలుతున్నాయి
కుట్రలతో కుతంత్రాలతో
పగాప్రతీకారాలతో అసూయాద్వేషాలతో
అక్రమాలకు పాల్పడుతూ మనిషి
అవినీతి ఊబిలో కూరుకుపోతున్నాడు...

ధనదాహంతో
పదవీ వ్యామోహంతో
మనిషి విర్రవీగుతున్నాడు
అశాంతితో మనిషి రగిలిపోతున్నాడు
దుష్ట తలంపులతో భ్రష్టుడైపోతున్నాడు...

కళ్ళు పొరలు కమ్మి కామంతో
మనిషి మృగంలా మారిపోతున్నాడు...

బుద్ధభూమిని యుద్ధభూమిగా మారుస్తూ
రాజ్యకాంక్షతో రక్తపుటేరులు పారిస్తూ
మనిషి రాక్షసుడై పోతున్నాడు...

అందుకే అశాంతితో మనిషి లోలోపల
కుమిలి పోతున్నాడు కుళ్ళిపోతున్నాడు
దానికి "మందు ఒక్కటే మానవత్వం"...

అందుకే...
ఓ మానవత్వమా నీవెక్కడంటే.?
ఆకలికి అలమటించే
అభాగ్యులను అనాధలను
విధవలాంద్రను ఆదుకునే
అమృతమూర్తుల ఆలోచల్లో
ఆపన్న అభయ హస్తాలలో
దాతృత్వపు గుణంలో...దాగి
నేనక్కడంటోంది...మానవత్వం...

ఓ మానవత్వమా నీవెక్కడంటే..?
నీడలేని నిస్సహాయులకు
కొండంత అండగా ఉండే
నిరుపేదలకు మేమున్నామని
తోడుగా నీడగా నిలిచే
నిస్వార్థపరులైన ధర్మమూర్తుల
సేవల్లో దైవత్వపు గుణంలో...దాగి
నేనక్కడంటోంది...మానవత్వం...

ఔను దానవత్వాన్ని దహనం చేస్తే
మానవత్వం చిగురించే వసంతమే...
అందుకే యుద్ధవిమానాలతో
ఈ ధరణి దద్దరిల్లకుండా
ప్రతిచోటా ప్రశాంతత ప్రజ్వరిల్లేలా...

ప్రతి మనిషి మనసు నేలలో
స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు...
సమానత్వం సౌభ్రాతృత్వాలకు...
పునాదులైన దయా జాలి కరుణలనే
మానవత్వపు విత్తనాలను నాటుదాం..
ప్రతిగుండెలో ప్రేమపూలను పూయిద్దాం...
విశ్వమంతా శాంతికపోతాల్ని ఎగురవేద్దాం.

జైహింద్... జై భారత్...

రచన:
కవి రత్న
సాహిత్య ధీర
సహస్ర కవి భూషణ్
పోలయ్య కూకట్లపల్లి
అత్తాపూర్ హైదరాబాద్

చట్టం సాహితీ లోకం 95814 19999

## తెలుగు తేజం చైతన్య రాజు



తెలుగు సింహాసనం పై సేవా సూర్యుడిగా
దరహాసంతో వెలుగులు నింపుతూ
మహాసభల మహోత్సవం మాణిక్యమై మెరిసిన
తెలుగు శిఖరం చైతన్య రాజు/
రెండు ప్రపంచ తెలుగు మహాసభలు
నిర్వహించిన ఘనత మీది
తరతరాలకు స్ఫూర్తిదాయకం తెలుగుకు వెలుగు భాషకు భరోసా తెలుగు సాంస్కృతిక దిక్సూచి ఆయనే మన తెలుగు తేజం చైతన్య రాజు/
చైతన్య పేరుగా చైతన్య స్వభావమై తెలుగు హృదయాల్లో జ్యోతి వెలిగించే జ్ఞాన దీపం మీరు
మీ జీవితం ఎందరికో స్ఫూర్తిప్రబంధం
చిరునవ్వులో ఆనందం
ఎందరో పేదలకు ఆరోగ్య భరోసా
మాటల్లో మాధుర్యం
కార్యాల్లో కర్తవ్యం బలం/
మనసులో మనోధైర్యం మార్గంలో మహత్తర లక్ష్యం తెలుగు సంస్కృతిని సిరి సంపదగా కాపాడే సజ్జనులు మీరు/
తెలుగు భాషకు తలమానికమైన తపనతో సాంస్కృతికి సర్వస్వం అర్పించి వజ్ర సంకల్పంతో తెలుగు జాతిని ఏకతాటిపై నిలిపిన మహోన్నత వ్యక్తిత్వం మీది /
తెలుగు వెలుగుల రారాజు
మన చైతన్య రాజు/
క్రమశిక్షణ సాహిత్యం తెలుగు భాష పట్లఅభిరుచి సేవా భావం
అందరినీ కలుపుకునే తత్వం
అంకితభావం కలిపి తెలుగు జాతి గర్వించదగ్గ
మహోన్నత మూర్తి రారాజు చైతన్య రాజు/
దీక్ష పట్టుదలతో పవిత్ర వేద భూమి
కోనసీమ గడ్డపై మూడవ ప్రపంచ తెలుగు మహాసభలు అమలాపురం మీ కిమ్స్ వైద్యశాల వేదికగా ఫిబ్రవరి 28 మార్చి 1వతేదీల్లో జరుగుతున్న సందర్భంగా తెలుగు తల్లి హృదయంలో ఆనందం చిగురిస్తుంది
తెలుగువారికి మరో సంక్రాంతి పండుగ నిండుగా/
తెలుగు తల్లి కిరీటానికి మాణిక్యాలు మీరు
సాహితీ పరిమళాలు ప్రపంచానికి పరిచయం చేస్తున్న మంచి మనసు మీది
తెలుగు వైభవాన్ని వెలుగులోకి తెస్తున్న తెలుగు శిఖరం మీరు/

(రెండు ప్రపంచ తెలుగు మహాసభలు విజయవంతంగా నిర్వహించి మూడవ ప్రపంచ తెలుగు మహాసభలు అమలాపురంలో ఫిబ్రవరి 28 మార్చి ఒకటి తేదీల లో కిమ్స్ మైదానంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సందర్భంగా గౌరవ శ్రీ చైతన్య రాజును ప్రశంసిస్తూ రాసిన కవిత)

నడక కవి, అక్షర ప్రవీణ
నల్లా నరసింహమూర్తి
సీనియర్ తెలుగు లెక్చరర్
శ్రీ శ్రీ కళా వేదిక జిల్లా అధ్యక్షులు
కురసాల వారి వీధి
అమలాపురం
డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా
9247577501

## మన పని



భూమి మీద ఉన్న ప్రతి ఒక్కరూ ఏదో ఒక పని చేస్తూ ఉండక తప్పదు
మనిషి జీవితం పనితోనే ప్రారంభం అవుతుంది
పని చేయకపోతే పనికిమాలిన వారు అవుతారు
ఎవరి పని వారు చేసుకుంటే తప్పు కాదు
పని లేని వారికి మాత్రం పూట గడవదు
పని పాట లేని వారి జీవితం వ్యర్థం
కృషితో నాస్తి దుర్భిక్షం
పిండిని బట్టి రొట్టె
చేసే పనిని బట్టి విలువ మరియు సంపద
పని లేని వారు అడ్డ దారులు తొక్కుతారు
పని నామోషీ కాదు
ఎవరో ఏమో అనుకుంటారని పనులు మానరాదు
సంపాదన లేని నాడు ఎవరూ అక్కరకు రారు
ఒత్తిడి తో పని చేయరాదు
ఆరోగ్యకరమైన పని మంచిది
పని చేస్తుంటే ఓర్వలేని వారు
ఇతరులకు సహాయం చేయడానికి ముందుకు రారు
ఏ రోజు పని ఆరోజే చేయాలి
పని జాప్యం మంచిది కాదు
ఎంత చెట్టుకు అంత గాలి
అసమానతలు తొలగి పని చేస్తూ అందరూ బాగుపడుతూ
దేశాన్ని ఉద్ధరించాలి ...

డి చాంద్ బాషా రచయిత

చట్టం సాహితీ లోకం 95814 19999

## ప్రశ్న పత్రం



చెట్టు ఎంత గట్టిగా ఉన్నా
పెరుగుతున్న వాతావరణాన్ని బట్టి
కాలాన్ని బట్టి ఆకులు, పూలు,
పండ్లు కాస్తూ ఉంటాయ్
మనిషి ఎంత నీతిగా బ్రతికినా
వృత్తిలో ఎంత నిజాయితీగా ఉన్నా
మనిషికి కష్టాలు, కన్నీళ్లు
సంతోషాలు, సంబరాలు అనేవి
వస్తూ పోతూ ఉంటాయ్
ఇక్కడ మనకు తెలుసుకోవాల్సింది
పిరికి వాడిలా తడబడడం కాదు
సంకల్పంతో నువ్వు నిలబడం నేర్చుకో!


జీవితం అనేది ప్రతీ మనిషికీ
ఒక పరీక్ష లాంటిది
ఎవరి ప్రశ్నలకు వారే
సమాధానాలు వెతుక్కోవాలి
నీ ప్రశ్న పత్రం నీదే
నీ ప్రశ్నలకు నువ్వే జవాబు రాయాలి
వేరే ప్రశ్నలకు సమాధానం రాస్తే
పరీక్షలో ఫెయిల్ అయ్యి
చివరికి నీ జీవితమే
ప్రశ్నగా మారుతుంది జాగ్రత్త!

రచన : కె.మురళీమోహన్ రాజు
నెల్లూరు.
సెల్ : 9866179385

చట్టం సాహితీ లోకం 95814 19999

## మనుషులు విస్తరించాలి

( We need to Expand)



జగతి మొత్తం.. విస్తరిస్తోంది
శరవేగంతో..నిరంతరం.
నక్షత్ర మండలి..నిత్యం
పెరుగుతునే ఉంది
క్షణం తీరిక లేకుండా.

ప్రాణమున్న ప్రతి జీవీ
పెరుగుతూ..విస్తరిస్తూ
ఎదుగుతూనే ఉంది..
కాలంతో నిమిత్తం లేకుండా.

ఆది అంతం లేని విశ్వంలో
మనుగడ సాగించాలంటే
అనుదినం పెరుగుతునే ఉండాలి.
ఎదుగుదల నిలిచిపోతే జీవం కోల్పోయినట్టే.

ఎదగడం.. జీవి లక్ష్యం
పెరుగుదల ప్రాణాన్ని సూచిస్తుంది.
ఎదుగూ బొదుగూ లేని
బతుకు..మరణంతో సమానం.

చెట్లు, చేమలు, కొండలు , గుట్టలతో
బాటు..మనుషులూ ఎదగాలి..
అడ్డంగా..నిలువుగా కాదు.
మేధోపరంగా , మానసికంగా.

మనస్సు వికసించని, మానవత్వం
పరిమళించని,మంచితనం
ప్రకాశించని ..మనిషి ఎదుగుదల
వ్యర్థం, స్వార్థంతో జీవించడం మృత ప్రాయం.

విజయకుమార్ గడియా
చిత్తూరు.

---------------

చట్టం సాహితీ లోకం 95814 19999

## వాసవదత్త ఉదయనుల గుణశీలములు



అవంతి ప్రభువు ప్రధ్యోతన, అంగారవతుల పుత్రిక వాసవదత్త,
ఆత్మ గౌరవము తోడ అద్భుత అందము కలిగిన దేవుని దత్త!

నిరుపమానమైన ప్రేమ భర్తపై కలిగిన అపురూప గుణవతి,
నిస్వార్థ త్యాగమునకు ప్రతీక యైన సౌందర్యవతి!

అత్యంత సహనమును కలిగిన వాసవదత్త చిరస్మరణీయురాలు, అవంతిక అనెడి పేరున పద్మావతికి అనుచరురాలు!

విశాల దృక్పథంతో దేశభక్తిని చూపిన పతివ్రత, వివిధ రకముల కష్టములను అనుభవించిన అనువ్రత!

సాహస గుణమును గల్గిన ఉదయనుడు ధీరోదాత్త నాయకుడు,
సకల కళ లందున ప్రవేశము గల్గిన గొప్ప పాలకుడు!

ప్రజారంజకముగా పాలనమును గావించిన గొప్ప చక్రవర్తి,
పగతురను ధైర్య సాహసములతో యెదిరించిన అభివర్తి!

సౌందర్యము నందు కంతు, జయంతులకు సమానుడు,
సతి వాసవదత్త మరణముతో కుంగిపోయిన అంతర్మనుడు!

భాస మహాకవి సృష్టించిన అద్భుత పాత్రలు వాసవదత్త ఉదయనులు, భ్రాతిని వ్యక్తపరచు సాహిత్య మందున భవ్యచరితులు!!

డాక్టర్ కురవి వేంకట కృష్ణ శాస్త్రి, చెన్నై


--------



# 26న ఉదయ్‌పూర్‌లో రష్మిక, విజయ్‌ల పెళ్లి

## మార్చి4న హైదరాబాద్‌లో రిసిప్షన్ అంటూ ప్రచారం

టాలీవుడ్‌లో హిట్ ఫెయిర్ హీరో విజయ్ దేవరకొండ- హీరోయిన్ రష్మిక మందన్న పెళ్లి వార్తలు ఇప్పుడు మరింత జోరందుకున్నాయి. వీరు వివాహ బంధంలోకి అడుగుపెట్టబోతున్నారనే ప్రచారం సోషల్ మీడియా, సినీ వర్గాల్లో వైరల్ అవుతోంది. ఫిబ్రవరి చివరి వారంలో వీరి పెళ్లి జరగనుందనే టాక్ ఇండస్ట్రీలో సెన్సేషన్ సృష్టిస్తోంది. రాజస్థాన్‌లోని అందమైన నగరం ఉదయ్‌పూర్ లోని ఓ రాయల్ ప్యాలెస్‌లో అత్యంత సన్నిహితులు, కుటుంబ సభ్యుల మధ్య సింపుల్‌గా పెళ్లి వేడుక జరపాలని ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఫిబ్రవరి 26 తేదీని ముహూర్తంగా ఖరారు చేసినట్లు ఇండస్ట్రీలో చర్చ నడుస్తోంది. ఈ వేడుకను గోప్యంగా ఉంచేందుకు ఎంత ప్రయత్నించినా సోషల్ మీడియాలో సమాచారం లీక్ అవుతూనే ఉండటం గమనార్హం. పెళ్లి వేడుక ఉదయ్‌పూర్‌లో సాదాసీదాగా జరిగినా, అసలు హంగామా మాత్రం హైదరాబాద్‌లోనే ఉండబోతుందని టాక్. మార్చి 4న నగరంలోని ప్రముఖ వేదికలో సినీ, రాజకీయ ప్రముఖుల కోసం భారీ రిసెప్షన్ నిర్వహించనున్నట్లు సమాచారం. టాలీవుడ్‌తో పాటు బాలీవుడ్‌కు చెందిన పలువురు స్టార్ సెలబ్రిటీలు ఈ వేడుకకు హాజరవుతారని అంచనాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల విజయ్ దేవరకొండ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కలిసి ఆహ్వాన పత్రిక అందించారనే ప్రచారం ఈ పెళ్లి వార్తలకు మరింత బలం చేకూర్చింది. తాజాగా విజయ్ దేవరకొండ వెడ్డింగ్ కార్డ్ నెట్టింట వైరల్ అవుతుంది. ఇది చాలా సింపుల్‌గా కనిపిస్తుంది. ఈ ఇన్విటేషన్ ప్రకారం వారి వివాహం ఫిబ్రవరి 26న వివాహవం జరగనుందని అర్ధమవుతుంది. రష్మిక - విజయ్‌లతో కలిసి పని చేసిన దర్శకులు, టెక్నీషియన్లు, సన్నిహితులు కూడా ఈ వేడుకలో పాల్గొనే అవకాశముందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఈ సెలబ్రిటీ వెడ్డింగ్ రిసెప్షన్‌కు ప్రముఖ దర్శకులు, నిర్మాతలు, స్టార్ హీరోలు హాజరవుతారనే అంచనాలు ఉన్నాయి.





# ఫౌజీ షూటింగ్‌లో ప్రభాస్‌కు గాయం




ప్రభాస్ నటిస్తున్న తాజా చిత్రం ఫౌజీ షూటింగ్‌లో స్వల్ప ప్రమాదం చోటుచేసుకున్నట్లు సమాచారం. గుర్రపు స్వారీ సన్నివేశం చిత్రీకరణ సమయంలో ప్రభాస్ కింద పడిపోవడంతో చేతులకు చిన్న గాయాలు అయినట్లు సినీ వర్గాలు వెల్లడించాయి. చిత్ర బృందం వెంటనే స్పందించి ప్రథమ చికిత్స అందించగా, గాయాలు తీవ్రంగా లేవని తెలిసింది. వైద్యులు ఒకటి రెండు రోజులు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు.ప్రస్తుతం ప్రభాస్ సురక్షితంగానే ఉన్నారని, త్వరలోనే మళ్లీ షూటింగ్‌లో పాల్గొననున్నారని యూనిట్ తెలిపింది. ఈ వార్తతో అభిమానులు తొలుత ఆందోళన చెందగా, గాయాలు చిన్నవేనని తెలిసి ఊపిరి పీల్చుకున్నారు. 'ఫౌజీ' చిత్రానికి హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తున్నారు. గతంలో సీతారామంతో ప్రశంసలు అందుకున్న ఆయన, ఈసారి మరింత ఎమోషన్‌తో కూడిన యాక్షన్ డ్రామాను భారీ స్థాయిలో తెరకెక్కిస్తున్నారని టాక్. ఈ సినిమాలో ప్రభాస్ బ్రిటిష్ సైనికుడి పాత్రలో కనిపించ నున్నారని సమాచారం. దేశభక్తి, ప్రేమ, త్యాగం వంటి అంశాలతో కథ నడుస్తుందని తెలుస్తోంది. గుర్రపు స్వారీతో కూడిన హై వోల్టేజ్ చేజింగ్ సన్నివేశం సినిమాకే హైలైట్‌గా నిలవనుందని, భారీ సెట్స్ మరియు విజువల్ ఎఫెక్ట్స్‌తో ఈ సన్నివేశాలను రూపొందిస్తున్నారని చిత్ర యూనిట్ చెబుతోంది. ఈ చిత్రంలో ఇమాన్వీ ఇస్మాయిల్ హీరోయిన్‌గా నటిస్తోంది.




# మార్చిలో రానున్న ఉస్తాద్ భగత్ సింగ్







పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా తెరకెక్కుతున్న భారీ మాస్ ఎంటర్‌టైనర్ ఉస్తాద్ భగత్ సింగ్ విడుదలకు సన్నద్ధమవుతోంది. ఇప్పటికే ఈ చిత్రంపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాలో రాశి ఖన్నా, శ్రీలీల హీరోయిన్లుగా నటిస్తుండగా, మాస్ కమర్షియల్ చిత్రాలకు కేరాఫ్ గా ఉన్న ప్రముఖ దర్శకుడు హరీష్ శంకర్ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. సంగీత బాధ్యతలను రాక్ స్టార్ దేవి శ్రీ ప్రసాద్ చేపట్టారు. మార్చి 26న ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు మేకర్స్ ఇప్పటికే అధికారికంగా ప్రకటించారు. సినిమా విడుదల తేదీ దగ్గరపడుతున్న నేపథ్యంలో ప్రమోషన్ కార్యక్రమాలను చిత్రబృందం మరింత వేగవంతం చేసింది. ఇటీవల విడుదలైన 'దేఖ్ లేంగే సాలా' లిరికల్ వీడియో అభిమానులను విశేషంగా ఆకట్టుకుంది. సోషల్ మీడియాలో ఈ పాటకు భారీ స్పందన లభించగా, అనేక మంది అభిమానులు వాట్సాప్ స్టేటస్‌లుగా కూడా పెట్టుకున్నారు. పవన్ కళ్యాణ్ మాస్ స్క్రీన్ ప్రెజెన్స్‌కు దేవిశ్రీప్రసాద్ అందించిన ఎనర్జిటిక్ బీట్‌లు జత కావడంతో ఈ సాంగ్ ట్రెండింగ్‌లో నిలిచింది. మొదటి పాట సూపర్ హిట్ కావడంతో సినిమా మీద హైప్ మరింత పెరిగింది. ఇప్పటికే మొదటి సాంగ్ సక్సెస్ కావడంతో రెండో పాట కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో చిత్రబృందం 'ఆరా ఆఫ్ ఉస్తాద్' అనే రెండో సాంగ్‌ను ఈ నెల 22న విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. ఈ ప్రకటనతో పాటు విడుదల చేసిన పోస్టర్ ప్రత్యేక డిజైన్‌తో ఉండి సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. పవన్ కళ్యాణ్ స్టైలిష్ లుక్, మాస్ అటిట్యూడ్ పోస్టర్‌లో హైలైట్ కావడంతో అభిమానుల్లో ఉత్సాహం మరింత రెట్టింపైంది. గతంలో పవన్ కళ్యాణ్ ? హరీష్ శంకర్ కాంబినేషన్‌లో వచ్చిన గబ్బర్ సింగ్ బ్లాక్‌బస్టర్ విజయాన్ని సాధించిన సంగతి తెలిసిందే. ఆ చిత్రం బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపించి పవన్ కెరీర్‌లో ప్రత్యేక స్థానం సంపాదించింది. అదే కాంబినేషన్ మళ్లీ రిపీట్ అవుతుండటంతో 'ఉస్తాద్ భగత్ సింగ్' కూడా మాస్ హిట్ అవుతుందనే నమ్మకం అభిమానుల్లో బలంగా కనిపిస్తోంది.

# ప్రమోషన్స్ పూర్తి చేసుకున్నాక టైటిల్ వివాదాలు

సినిమా ప్రమోషన్లన్నీ పూర్తి చేసుకున్నాక, సరిగ్గా సెన్సార్ సర్టిఫికేట్ వచ్చే సమయంలో టైటిల్ మార్చాల్సి రావడం నిర్మాతలకు పెద్ద తలనొప్పిగా మారింది. తాజాగా యంగ్ హీరో సుహాస్ నటించిన సినిమా కూడా ఇదే సమస్యను ఎదుర్కొంది. కేవలం సుహాస్ మాత్రమే కాదు, ఈ మధ్య కాలంలో మరికొన్ని చిన్న సినిమాలు కూడా సెన్సార్ అ÷-జబెక్షన్స్ వల్ల పేర్లు మార్చుకున్నాయి. సుహాస్, శివానీ నగరం జంటగా నటించిన చిత్రం 'హే భగవాన్'. ఈ నెల 20న విడుదలకు సిద్ధమైన ఈ సినిమాపై సెన్సార్ బోర్డు అభ్యంతరం వ్యక్తం చేసింది. దేవుడి పేరుతో ఉన్న టైటిల్ వల్ల కొన్ని వర్గాల సెంటిమెంట్స్ దెబ్బతినే అవకాశం ఉందని భావించిన బోర్డు, పేరు మార్చాలని సూచించింది. దీంతో మేకర్స్ చేసేదేమీ లేక చివరి నిమిషంలో టైటిల్‌ను 'హే బలవంత్!' గా మార్చారు. ప్రమోషన్లన్నీ పాత పేరుతోనే జరగడంతో ఈ మార్పు సినిమాపై ఎలాంటి ప్రభావం చూపుతుందోనని చిత్ర యూనిట్ ఆందోళన చెందుతోంది. ఇటీవల విడుదలైన 'వానర' చిత్రానికి కూడా ఇదే పరిస్థితి ఎదురైంది. ఈ చిత్రంలో కుల రాజకీయాలు మరియు సున్నితమైన అంశాలు ఉండటం, టైటిల్ ఏమో హనుమంతుడిని గుర్తు చేసేలా ఉండటంతో సెన్సార్ బోర్డు నో చెప్పింది. దీంతో ఈ సినిమాను 'వనవీర' పేరుతో విడుదల చేయాల్సి వచ్చింది. ప్రమోషన్ల కోసం ఖర్చు పెట్టిన డబ్బు, టైటిల్ రీచ్ అంతా వృథా అయిందని ఆ చిత్ర దర్శకుడు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే శివ కందుకూరి నటించిన 'చాయ్ వాలా' సినిమాకు కూడా సెన్సార్ కష్టాలు తప్పలేదు. ఈ టైటిల్ వాడకూడదని బోర్డు పట్టుబట్టడంతో, చిత్ర యూనిట్ తమ వర్కింగ్ టైటిల్ అయిన 'నవాబ్ కేఫ్'ను ఖరారు చేసింది. తండ్రీ కొడుకుల మధ్య సాగే ఈ ఎమోషనల్ డ్రామా ఫిబ్రవరి 20న కొత్త పేరుతో థియేటర్లలోకి రానుంది. చిన్న సినిమాలకు టైటిల్ అనేది బ్రాండింగ్‌లో కీలక పాత్ర పోషిస్తుంది. ఇలాంటి సమయంలో సెన్సార్ బోర్డు నిబంధనలు చిన్న నిర్మాతలకు భారంగా మారుతున్నాయి.









# పాక్ ఓటమిని శాసించింది వీరే..

టీ20 వరల్డ్ కప్ 2026లో భారత జట్టు పాకిస్థాన్‌పై మరో చిరస్మరణీయ విజయాన్ని నమోదు చేసింది. దాంతో సూపర్-8లో తన స్థానాన్ని దాదాపు ఖరారు చేసుకుంది. ఎంతో ఉత్కంఠ రేపుతుందని ఆశించిన ఫ్యాన్స్ కు నిరాశ కలిగిస్తూ ఏకపక్షంగా సాగిన మ్యాచులో భారత్ 61 పరుగుల తేడాతో పాకిస్థాన్‌ను చిత్తు చేసింది. కొలంబోలోని ఆర్. ప్రేమదాస స్టేడియంలో జరిగిన పోరులో కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలోని టీమ్ ఇండియా అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్ లో అద్భుత ప్రదర్శన చేసింది. టాస్ ఓడి ఫస్ట్ బ్యాటింగ్ చేసిన భారత్ 20 ఓవర్లలో 175 పరుగులు బోర్డుపై ఉంచింది. టీ20 వరల్డ్ కప్‌లో పాకిస్థాన్‌పై భారత్‌కు ఇదే అత్యధిక స్కోరు కావడం విశేషం. ఆరంభంలోనే షాక్ తగిలినప్పటికీ, ఆ తర్వాత మరో ఓపెనర్ ఇషాన్ కిషన్ తన ధనాధన్ బ్యాటింగ్‌తో మ్యాచ్ స్వరూపాన్ని మార్చేశాడు. ఇషాన్ వేగంగా పరుగులు రాబడుతూ 40 బంతుల్లో 77 పరుగులు చేశాడు. స్టేడియం నలుమూలలా షాట్లు ఆడుతూ పాకిస్థాన్ బౌలర్లపై ఒత్తిడి పెంచడంలో సక్సెస్ అయ్యాడు. తన పరుగులతో భారత విజయంలో కీలక పాత్ర పోషించి ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ దక్కించుకున్నాడు. ఇషాన్ కిషన్ అవుట్ అయిన తర్వాత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. మిడిల్ ఓవర్లలో ఆచితూచి బ్యాటింగ్ చేస్తూ తిలక్ వర్మతో కలిసి భాగస్వామ్యం నెలకొల్పి జట్టు స్కోరును 170 దాటించడంలో కీలకపాత్ర పోషించాడు. . సూర్య 29 బంతుల్లో 32 పరుగులు చేయగా.. చివర్లో ఆల్ రౌండర్ శివమ్ దూబే 158.82 స్ట్రైక్ రేట్‌తో 27 పరుగులు చేశాడు. దాంతో భారత్ ఈ పిచ్ మీద పాక్‌కు భారీ టార్గెట్ ఇవ్వగలిగారు. 175 పరుగుల టార్గెట్ కాపాడుకునే క్రమంలో బరిలోకి దిగిన భారత జట్టుకు బౌలర్లు అద్భుత ఆరంభాన్ని ఇచ్చారు. హార్దిక్ పాండ్యా తన మొదటి ఓవర్లోనే పాకిస్థాన్ ఓపెనర్‌ను అవుట్ చేసి తొలి దెబ్బ కొట్టాడు. 3 ఓవర్లలో కేవలం 16 పరుగులు ఇచ్చి 2 వికెట్లు తీశాడు. తన బౌలింగ్ లో పాక్ బ్యాటర్లకు స్వేచ్ఛగా ఆడే అవకాశం ఇవ్వలేదు. పాక్ స్పిన్నర్లతో ఇబ్బంది పెడితే భారత్ మాత్రం పేసర్లు, స్పిన్నర్లతో పాక్ ను కట్టడి చేసింది.భారత ఫాస్ట్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా తన స్పెల్‌లో సయీమ్ అయూబ్, పాక్ కెప్టెన్ సల్మాన్ అలీ ఆగా వికెట్లు తీసి పాకిస్థాన్ బ్యాటింగ్‌ను బ్యాక్‌ఫుట్‌లోకి నెట్టాడు. బుమ్రా బౌలింగ్ తో పాక్ బ్యాటర్లు పరుగులు చేయడానికి ఇబ్బంది పడ్డారు. మిడిల్ ఓవర్లలో స్పిన్నర్ అక్షర్ పటేల్ రాణించాడు. పాకిస్థాన్ కీలక బ్యాటర్లను అవుట్ చేసి మ్యాచ్‌పై భారత్ పట్టు బిగించేలా చేశాడు. వీరికి తోడు మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి కూడా ఒకే ఓవర్లో రెండు వికెట్లు తీశాడు. 176 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన పాకిస్థాన్ జట్టు భారత బౌలర్ల ధాటికి 114 పరుగులకే కుప్పకూలింది. ఈ విజయంతో భారత్ తన గ్రూపులో అగ్రస్థానాన్ని నిలుపుకుంది. టీ20 వరల్డ్ కప్‌లో పాక్ పై భారత్ ఆధిక్యం 8-1కి పెరిగింది. భారత్ నెక్స్ట్ మ్యాచ్‌ను ఫిబ్రవరి 18న నరేంద్ర మోదీ స్టేడియంలో నెదర్లాండ్స్‌తో ఆడనుంది.

...........




# ఎట్టకేలకు బోణీ కొట్టిన అఫ్గానిస్థాన్

**యూఏఈపై అఫ్గాన్ ఘన విజయం అఫ్గాన్ సూపర్ 8 ఛాన్స్ సజీవం**



టీ20 ప్రపంచకప్?లో అఫ్గానిస్థాన్ ఎట్టకేలకు బోణీ కొట్టింది. ఈ టోర్నీలో తొలి రెండు మ్యాచ్?లో ఓటమిపాలైన అఫ్గాన్, తాజాగా యూఏఈపై ఘన విజయం సాధించింది. యూఏఈ నిర్దేశించిన 161 పరుగుల టార్గెట్?ను 19.2 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఇబ్రహీం జద్రాన్ (53 పరుగులు), అజ్మతుల్లా ఒమర్జాయ్ (40లి పరుగులు) రాణించారు. యూఏఈ బౌలర్లలో జునైద్ సిద్ధిఖీ 2, మహ్మద్ అర్ఫాన్ చెరో 2, మహ్మద్ జువాదుల్లా 1 వికెట్ దక్కించుకున్నారు.తొలుత బ్యాటింగ్ చేసిన యూఏఈ నిర్ణీత 20 ఓవర్లలో9 వికెట్ల నష్టానికి 160 పరుగులు చేసింది. షోయబ్ ఖాన్ (68 పరుగులు) హాఫ్ సెంచరీతో రాణించగా, అలిశన్ షరఫు (40 పరుగులు) ఆకట్టుకున్నాడు. అఫ్గాన్ బౌలర్లలో అజ్మతుల్లా ఒమర్జాయ్ 4, ముజీబ్ అర్ రెహ్మాన్ 2, రషీద్ ఖాన్ 1 వికెట్ దక్కించుకున్నారు. కాగా, ఈ మ్యాచ్?లో అఫ్గాన్ కెప్టెన్ రషీద్ ఖాన్ అరుదైన ఘనత సాధించాడు. ఈ మ్యాచ్?లో అర్ఫాన్ వికెట్ తీయడంతో టీ20ల్లో 700 వికెట్లు పడగొట్టిన తొలి బౌలర్?గా నిలిచాడు. మొత్తం 513 టీ20ల్లో ఈ ఫీట్ అందుకున్నాడు. ఇందులో ఆయా దేశాల లీగులు, అంతర్జాతీయ టీ20 క్రికెట్?లో కలిపి ఈ వికెట్లు సాధించాడు. టీ20 క్రికెట్?లో 700 వికెట్ల మైలురాయి అందుకున్న ఏకైక బౌలర్?గా రషీద్ నిలిచాడు. ఇందులో అంతర్జాతీయ టీ20ల్లో 191 వికెట్లు పడగొట్టాడు. అత్యధిక వికెట్లు తీసిన అఫ్గాన్ బౌలర్?గానూ రషీద్ టాప్?లో కొనసాగుతున్నాడు. అటు ఐపీఎల్?లో అతడు 114 మ్యాచ్?ల్లో 158 వికెట్లు కూల్చాడు. ఇక ఓవరాల్?గా రషీద్ తర్వాత ఈ లిస్ట్?లో వెస్టిండీస్ మాజీ క్రికెటర్ డ్వేన్ బ్రావో 631 వికెట్లతో రెండో స్థానంలో ఉన్నాడు. అదే దేశానికి చెందిన సునీల్ నరైన్ 613 వికెట్లతో ఈ లిస్ట్?లో మూడో స్థానంలో కొనసాగుతున్నాడు. టీ20 వరల్డ్?కప్? హిస్టరీలో 140ం పరుగుల ఛేదనలో అఫ్గాన్?కు ఘనమైన రికార్డేమీ లేదు. ఇప్పటిదాకా 15సార్లు 140ం పరుగుల ఛేదనలో దిగిన అఫ్గాన్, ఈ మ్యాచ్?సహా విజయం సాధించింది కేవలం నాలుగు మ్యాచ్?ల్లోనే. అత్యధికంగా 10సార్లు ఓడింది. ఈ టోర్నీలోనే సౌతాఫ్రికాతో మ్యాచ్ టై అయ్యింది. ఇక ప్రస్తుత టోర్నమెంట్?లో గ్రూప్ డీలో ఉన్న అఫ్గాన్ తొలి మ్యాచ్?లో న్యూజిలాండ్?ను ఢీ కొట్టింది. ఆ మ్యాచ్?లో 5 వికెట్ల తేడాతో ఓడింది. తర్వాత సౌతాఫ్రికాతో మ్యాచ్?లో గెలుపు అంచులదాకా వెళ్లి బోల్తా కొట్టింది. ఆ మ్యాచ్? డ్రా అవ్వడంతో సూపర్ ఓవర్?కు వెళ్లింది. అయితే సూపర్ ఓవర్ కూడా డ్రా అవ్వడంతో రెండోసారి సూపర్ ఓవర్ నిర్వహించాల్సి వచ్చింది. ఇక రెండో సూపర్ ఓవర్?లో 5 పరుగుల తేడాతో సౌతాఫ్రికా నెగ్గింది. దీంతో అఫ్గాన్?కు వరుసగా రెండో ఓటమి ఎదురైంది. టోర్నీలో నిలవాలంటే తప్పక నెగ్గాల్సిన పరిస్థితిలో యూఏఈపై విజయం సాధించి సూపర్ 8 ఆశలు సజీవంగా ఉంచుకుంది. గ్రూప్ దశలో అఫ్గాన్ తమ ఆఖరి మ్యాచ్?లో కెనడాను ఢీ కొట్టాల్సి ఉంది.

# ఇంగ్లాండ్‌ను వణికించిన ఇటలీ

**24 పరుగుల తేడాతో ఓడిన ఇటలీ**

**సూపర్ 8 రేసు నుంచి ఇటలీ నిష్క్రమణ**

**సూపర్ 8కు చేరిన ఇంగ్లాండ్ జట్టు**



టీ20 వరల్డ్?కప్?లో ఇంగ్లాండ్ మూడో విజయం నమోదు చేసి సూపర్ 8కు దూసుకెళ్లింది. గ్రూప్ దశలో భాగంగా సోమవారం ఇటలీతో జరిగిన మ్యాచ్?లో 24 పరుగుల తేడాతో నెగ్గింది. ఇంగ్లాండ్ నిర్దేశించిన 203 పరుగుల టార్గెట్?ను ఇటలీ ఓవర్లన్నీ ఆడి 178 పరుగులకు ఆలౌట్ అయ్యింది. బెన్ మనెంటి (60 పరుగులు, 25 బంతుల్లో) మెరుపు ఇన్నింగ్స్ వృథా అయ్యింది. ఇంగ్లాండ్ బౌలర్లలో శామ్ కరన్, జెమీ ఒవర్టన్ చెరో 3, జోఫ్రా ఆర్చర్ 2, విల్ జాక్స్, ఆదిల్ రషీద్ చెరో 1 వికెట్ దక్కించుకున్నారు. తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 202 పరుగులు చేసింది. విల్ జాక్స్ (53 పరుగులు, 22 బంతుల్లో) మెరుపు హాఫ్ సెంచరీ సాధించాడు. టామ్ బంటన్ (30 పరుగులు), ఫిల్ సాల్ట్ (28 పరుగులు), శామ్ కరన్ (25 పరుగులు), జాకబ్ బెతెల్ (23 పరుగులు) ఆకట్టుకున్నారు. ఇటలీ బౌలర్లలో గ్రాంట్ స్టీవార్ట్, క్రిషన్ కలుగమానే చెరో 2, జేజే స్మట్స్, అలీ హసన్, బెన్ మనెంటి తలో 1 వికెట్ దక్కించుకున్నారు. కాగా, ఈ టోర్నీలో రెండో ఓటమితో గ్రూప్ సీ నుంచి ఇటలీ సూపర్ 8 రేసు నుంచి నిష్క్రమించింది. ఇప్పటిదాకా మూడు మ్యాచ్?లు ఆడగా, ఇటలీ ఒక మ్యాచ్? (నేపాల్?తో)లోనే నెగ్గింది. ఇక లీగ్ స్టేజ్?లో చివరిదైన నాలుగో మ్యాచ్ ఫిబ్రవరి 19న వెస్టిండీస్?తో జరగనుంది. ఈ గ్రూప్?లో ఇప్పటికే వెస్టిండీస్ సూపర్ 8కు అర్హత సాధించింది.

# 10వ తరగతి పరీక్షలకు వైభవ్ సూర్యవంశీ డుమ్మా!




టీమ్ ఇండియా అండర్-19 ప్రపంచ కప్ 2026 టైటిల్ గెలవడంలో కీలకపాత్ర పోషించాడు 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ. గత ఏడాది నుంచి నిత్యం వార్తల్లో నిలుస్తున్నాడు ఈ టీనేజ్ సంచలనం. ఇటీవల వైభవ్ సూర్యవంశీ 10వ తరగతి పరీక్ష రాయబోతున్నాడని వార్త వచ్చింది. తాజా సమాచారం ప్రకారం వైభవ్ సూర్యవంశీ పరీక్షలకు హాజరు కావడం లేదు. ఈ విషయాన్ని క్రికెటర్ వైభవ్ తండ్రి స్వయంగా తెలిపారు. తాజ్‌పూర్ లోని మోడెస్టీ పాఠశాల ప్రిన్సిపాల్ ఆదర్శ్ కుమార్ అలియాస్ పింటూ మాట్లాడుతూ వైభవ్ సూర్యవంశీ తండ్రితో మాట్లాడిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. భారత క్రికెట్ కంట్రోల్ బోర్డ్ బిజీ షెడ్యూల్ కారణంగా వైభవ్ పరీక్షలు రాయలేకపోతున్నాడని, అయితే అతని ప్రిపరేషన్స్, ఎగ్జాట్ సెంటర్ సంబంధించిన అన్ని ఫార్మాలిటీస్ పూర్తయ్యాయని ఆయన అన్నారు. మొదట తాను పరీక్షలకు హాజరు కావాలని బీసీసీఐని పర్మిషన్ అడిగాడని వార్తలు వచ్చాయి. కానీ అండర్ 19 టీం బిజీ షెడ్యూల్స్, మ్యాచ్‌లకు అందుబాటులో ఉండేందుకు టెన్త్ బోర్డ్ ఎగ్జామ్స్ రాయడం లేదని తెలుస్తోంది. తాజా సమాచారం ప్రకారం వైభవ్ సూర్యవంశీ ఎగ్జామ్ సెంటర్ పోడ్దార్ ఇంటర్నేషనల్ స్కూల్, సమస్తిపూర్ లో ఉంది. స్కూల్ ప్రిన్సిపాల్ నీల్ కిషోర్ ఈ విషయాన్ని ధృవీకరిస్తూ వైభవ్ అడ్మిట్ కార్డు వచ్చిందని, అన్ని అవసరమైన డాక్యుమెంట్లు స్కూల్ యాజమాన్యం వద్ద భద్రంగా ఉంచామని చెప్పారు. వైభవ్ సాధారణ విద్యార్థిలాగే పరీక్షకు వస్తాడని, అతని కోసం ఎలాంటి ప్రత్యేక ఏర్పాట్లు చేయలేదని ఆయన స్పష్టం చేశారు.

# 19 ఏళ్ల తర్వాత చరిత్ర సృష్టించిన ఇషాన్ కిషన్..!



టీ20 వరల్డ్ కప్‌లో దాయాది దేశాల మధ్య జరిగిన హై-వోల్టేజ్ పోరులో టీమిండియా ఘనవిజయం సాధించింది. భారత బౌలర్లు నిప్పులు చెరిగే బంతులతో విరుచుకుపడటంతో.. పాక్ బ్యాటర్లు బెంబేలెత్తిపోయారు. ఏ దశలోనూ పోటీ ఇవ్వలేకపోయిన పాకిస్తాన్ జట్టును.. భారత్ 61 పరుగుల భారీ తేడాతో చిత్తు చేసి, తన అజేయమైన రికార్డును కొనసాగించింది. ముందుగా టాస్ గెలిచిన పాకిస్తాన్ జట్టు తొలుత బౌలింగ్ ఎంచుకుంది. దీంతో భారత జట్టు మొదట బ్యాటింగ్ చేసింది. ఓపెనర్లు ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మ ఓపెనర్లుగా క్రీజులోకి వచ్చారు. అయితే, అభిషేక్ డకౌట్ రూపంలో మొదటి ఓవర్లోనే ఔట్ అయ్యాడు. దీంతో పాక్ ప్లేయర్లు సంబరాలు చేసుకున్నారు. అయితే, వారి ఆనందం ఎక్కువసేపు నిలవలేదు. టీమిండియా ఓపెనర్ ఇషాన్ కిషన్ పాకిస్తాన్ బౌలర్లపై బ్యాటుతో విరుచుకుపడ్డాడు. ఈ మ్యాచ్‌లో ఇషాన్ కిషన్ హిస్టరీ క్రియేట్ చేశాడు. ఐసీసీ టీ20 ప్రపంచ కప్ 2007 ఫైనల్ తరువాత పాకిస్తాన్ జట్టుపై హాఫ్ సెంచరీ బాదిన తొలి ఓపెనర్‌గా ఇషాన్ కిషన్ చరిత్రకెక్కాడు. టీ20 ప్రపంచ కప్ 2026లో భాగంగా ఆదివారం పాకిస్తాన్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో ఇషాన్ కిషన్ 40 బంతుల్లో 77 పరుగులు చేయడం ద్వారా ఈ ఘనత సాధించాడు. పాకిస్తాన్ జట్టుపై జరిగిన మ్యాచ్‌లో దూకుడుగా ఆడిన ఇషాన్ కిషన్ 27 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఈ క్రమంలో గత 19 ఏళ్ల రికార్డును బద్దలు కొట్టాడు. గత 19 ఏళ్లలో ఏ భారత ఓపెనర్ కూడా పాక్‌పై టీ20 ప్రపంచ కప్‌లో హాఫ్ సెంచరీ సాధించలేదు. చివరి సారిగా 2007 టీ20 వరల్డ్ కప్ ఫైనల్లో గౌతమ్ గంభీర్ ఓపెనర్‌గా వచ్చి పాకిస్తాన్‌పై హాఫ్ సెంచరీ సాధించాడు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఏ భారత ఓపెనర్ హాఫ్ సెంచరీ సాధించలేదు. రోహిత్ శర్మ, శిఖర్ ధావన్, కేఎల్ రాహుల్ ఓపెనర్లుగా బరిలోకి దిగినా పాకిస్తాన్ జట్టుపై 50 పరుగులు చేయలేక పోయారు. తాజాగా.. ఆ ఘనతను ఇషాన్ కిషన్ సాధించాడు.

# రోహిత్ శర్మ, వసీం అక్రమ్ ఆలింగనం..



ప్రపంచ క్రికెట్‌లో భారత్-పాకిస్తాన్ మ్యాచ్ అంటే కేవలం ఆట మాత్రమే కాదు, అదొక ఎమోషన్. శ్రీలంక వేదికగా జరుగుతున్న టీ20 వరల్డ్ కప్ 2026లో భాగంగా ఆదివారం (ఫిబ్రవరి 15) జరిగిన పోరులో టీమిండియా అద్భుత విజయం సాధించింది. అయితే ఈ మ్యాచ్‌లో ఆట కంటే కూడా మైదానం వెలుపల జరిగిన కొన్ని సంఘటనలు ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. ముఖ్యంగా ఇరు జట్ల ఆటగాళ్లు కనీసం చేతులు కూడా కలుపుకోకపోవడం ఒక ఎత్తైతే, టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ, పాక్ దిగ్గజం వసీం అక్రమ్ ఒకరినొకరు ఆలింగనం చేసుకోవడం చర్చనీయాంశమైంది. 2025 ఆసియా కప్ నుంచి ఇరు దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా ఆటగాళ్లు ఒకరికొకరు షేక్ హ్యాండ్ ఇచ్చుకోవడం మానేశారు. ఈ వరల్డ్ కప్ మ్యాచ్‌లో కూడా టాస్ సమయంలో సూర్యకుమార్ యాదవ్, పాక్ కెప్టెన్‌కు కనీసం చేయి కూడా కలపలేదు. మ్యాచ్ ముగిసిన తర్వాత కూడా ప్లేయర్లు నేరుగా డ్రెస్సింగ్ రూమ్‌కి వెళ్ళిపోయారు తప్ప గతంలోలా పలకరించుకోలేదు. అయితే, ఈ టీ20 ప్రపంచకప్‌కు అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్న రోహిత్ శర్మ మాత్రం తన క్రీడా స్ఫూర్తిని చాటుకున్నాడు. మైదానంలో వసీం అక్రమ్‌ను చూడగానే దగ్గరకు వెళ్లి ఆత్మీయంగా హత్తుకున్నాడు. దీనికి సంబంధించిన వీడియో ఇప్పుడు ఇంటర్నెట్‌లో విపరీతంగా షేర్ అవుతోంది. మ్యాచ్ విషయానికి వస్తే.. టాస్ గెలిచిన పాకిస్తాన్ మొదట బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 175 పరుగులు చేసింది. ఓపెనర్ ఇషాన్ కిషన్ కేవలం 40 బంతుల్లోనే 10 ఫోర్లు, 3 సిక్సర్లతో విరుచుకుపడి 77 పరుగులు చేశాడు. యువ బ్యాటర్ల మెరుపులతో భారత్ గౌరవప్రదమైన స్కోరును బోర్డుపై ఉంచింది. మెరుపు ఇన్నింగ్స్ ఆడిన ఇషాన్‌కే ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. 176 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన పాకిస్తాన్ ఏ దశలోనూ భారత బౌలర్లకు పోటీ ఇవ్వలేకపోయింది. జస్ప్రీత్ బుమ్రా, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, వరుణ్ చక్రవర్తి తలో రెండు వికెట్లతో పాక్ నడ్డి విరిచారు. పాక్ బ్యాటర్లలో ఉస్మాన్ ఖాన్ (44) తప్ప మిగిలిన వారందరూ పెవిలియన్‌కు క్యూ కట్టారు. ఆ జట్టులో ఏకంగా ఏడుగురు బ్యాటర్లు రెండంకెల స్కోరు (10 పరుగులు) కూడా చేయలేకపోవడమే వారి ఘోర వైఫల్యానికి నిదర్శనం. ఫలితంగా 18 ఓవర్లలోనే పాకిస్తాన్ 114 పరుగులకే ఆలౌట్ అయింది.రిటైర్మెంట్ తర్వాత కూడా రోహిత్ శర్మ క్రేజ్ ఏమాత్రం తగ్గలేదని కొలంబో స్టేడియంలో అర్థమైంది. వరల్డ్ కప్ అంబాసిడర్‌గా ఆయన రాకతో గ్యాలరీల్లో జోష్ పెరిగింది. ఒకవైపు ఆటగాళ్ల మధ్య గొడవలు, షేక్ హ్యాండ్స్ వివాదాలు నడుస్తున్నా.. రోహిత్ మాత్రం హుందాగా ప్రవర్తించి అందరి ప్రశంసలు అందుకుంటున్నాడు. సోషల్ మీడియాలో కొందరు రోహిత్‌ను విమర్శిస్తున్నప్పటికీ, మెజారిటీ అభిమానులు మాత్రం ఆయనలోని స్నేహపూర్వక వైఖరిని అభినందిస్తున్నారు.

# బాబర్ ఆజామ్‌పై అశ్విన్ వ్యంగ్యాస్త్రాలు



పాకిస్థాన్ బ్యాటర్ బాబర్ ఆజామ్‌పై టీమిండియా స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ వ్యంగ్యాస్త్రాలు సంధించాడు. మెరుపు తీగలా వచ్చి వెళ్లిపోయాడని సెటైర్స్ వేసాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా ఆదివారం పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత్ 61 పరుగుల తేడాతో విజయం సాధించిన సంగతి తెలిసిందే.భారత్ నిర్దేశించిన 176 పరుగుల లక్ష్య ఛేదనలో పాకిస్థాన్ 114 పరుగులకు ఆలౌటైంది. హార్దిక్ పాండ్యా, జస్ప్రీత్ బుమ్రా తొలి రెండు ఓవర్లలోనే పాకిస్థాన్ సైమ్ అయూబ్, సాహిబ్‌జా ఫర్హాన్, సల్మాన్ అలీ అఘా ఔటవ్వడంతో పాకిస్థాన్ తీవ్ర ఒత్తిడికి లోనైంది. ఈ పరిస్థితుల్లో జట్టును ఆదుకునే బాధ్యత బాబర్ ఆజంపై పడింది. కానీ 31 ఏళ్ల బాబర్ ఆజామ్ తీవ్రంగా నిరాశపర్చాడు. లెఫ్టార్మ్ స్పిన్నర్ అక్షర్ పటేల్ వేసిన ఐదో ఓవర్‌లో స్వీప్ షాట్ ఆడబోయి క్లీన్ బౌల్డ్ అయ్యాడు.దాంతో కేవలం ఏడు బంతుల్లో ఐదు పరుగులు మాత్రమే చేసి బాబర్ త్వరగానే పెవిలియన్ చేరాడు. బాబర్ ఆజామ్ ఔటైన తీరుపై రవిచంద్రన్ అశ్విన్ సోషల్ మీడియా వేదికగా స్పందించాడు. పాపులర్ కామెంటేటర్, టీమిండియా మాజీ హెడ్ కోచ్ రవిశాస్త్రి తన వ్యాఖ్యనంలో తరుచూ చెప్పే డైలాగ్‌తో బాబర్ ఆజామ్‌పై వ్యంగ్యాస్త్రాలు సంధించాడు.బాబర్ ఆజం నిష్క్రమణపై అభిమానులు కూడా తమదైన శైలిలో స్పందించారు. తెలుగు సినిమా సింహరాశిలోని ఫేమస్ డైలాగ్ అయిన 'మెరుపు తీగ వచ్చి పోమ్మా' అనే వ్యాఖ్యతో సెటైర్లు పేలుస్తున్నారు. బాలీవుడ్ చిత్రం 'దురందర్'లో భారత ఏజెంట్ పాకిస్థాన్‌ను నాశనం చేసినట్లుగా బాబర్ తన జట్టును నాశనం చేశాడని మరికొందరు ఫన్నీ కామెంట్స్ చేశారు. బాబర్ ఔటైన తర్వాత పాకిస్థాన్ ఇన్నింగ్స్ కుప్పకూలింది. ఉస్మాన్ ఖాన్(44) పోరాడినా ఫలితం లేకపోయింది. అతనికి ఇతర బ్యాటర్ల నుంచి మద్దతు లభించలేదు. దాంతో పాకిస్థాన్ 18 ఓవర్లలో 114 పరుగులకే కుప్పకూలి ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. హార్దిక్ పాండ్యా, జస్ప్రీత్ బుమ్రా, వరుణ్ చక్రవర్తి, అక్షర్ పటేల్ రెండేసి వికెట్లతో పాకిస్థాన్ పతనాన్ని శాసించారు. భారత ఇన్నింగ్స్‌లో ఇషాన్ కిషన్ కేవలం 40 బంతుల్లో 77 పరుగులతో కీలకమైన ఇన్నింగ్స్‌ను ఆడాడు. దాంతో అతనికి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది.

Edited, Published and Owned by Baddala LaKshmi Narayana, and Printed at BADDAL Publications, #B.No.28/07, R.G.K. Apartments, Bellary Road, Kurnool - 518 003. A.P.
Editor Baddala Lakshmi Narayana, Redg. No. APTEL/2011/40367. chattamnews@gmail.com. baddalpublications@gmail.com. Cell: 916000 3999 / 4999 / 5999